స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com
PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 145 | మంగళవారం, అక్టోబర్ 13, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 12 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 145 | TUESDAY, OCTOBAR 13, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 12 | RS : 5-00 |


## నిరుద్యోగ యువతకు రూ.40 వేల విలువైన ఉచిత కోచింగ్!

- 'పొంగులేటి శీనన్న యువనేస్తం' ప్రారంభం.. నేటి నుంచే రిజిస్ట్రేషన్లు
- ఏడాది పాటు ఆన్‌లైన్‌లో పోటీ పరీక్షలకు శిక్షణ
- ఆర్థిక ఇబ్బందులు యువత ఉద్యోగ కలలకు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో కార్యక్రమం

2

# ఎస్ఐఆర్ పేరుతో ఓటు చోరీకి కుట్ర!

- మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణలు
- 'సైమన్ గో బ్యాక్' స్ఫూర్తితో 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం
- ఓటు హక్కు పరిరక్షణ మరో స్వాతంత్ర్య పోరాటం..
- రాహుల్‌గాంధీతో కలిసి కదం తొక్కాలి

హైదరాబాద్ అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమం వంటిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన పౌరుల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ఆరోపణలు చేశారు. ఓటు బచావో–దేశ్ బచావో ఉద్యమంలో భాగంగా సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు.




### 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమానికి పిలుపు

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆనాడు 'సైమన్ గో బ్యాక్' నినాదంతో పోరాటం సాగిందని, ఇప్పుడు ఓటు హక్కుల పరిరక్షణ కోసం 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాల్సిన పరిస్థితి వచ్చిందని సీఎం అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి నాయకత్వంలో ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రాజ్యాంగం ద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు కల్పించి సమానత్వానికి బాటలు వేశారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు లేని అర్హులను జాబితాలో చేర్చడంపై దృష్టి పెట్టేవారని, ప్రస్తుతం ఉన్న ఓటర్ల పేర్ల తొలగింపునకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

### ఎన్నికల సంఘం స్వతంత్రతపై ప్రశ్నలు

ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన రాజ్యాంగ సంస్థ అని సీఎం పేర్కొన్నారు. కమిషనర్ల నియామక విధానంలో 2023లో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులు పారదర్శకతపై సందేహాలు కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత దెబ్బతింటే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకం, ఎస్ఐఆర్ ప్రక్రియపై వస్తున్న అభ్యంతరాలకు కేంద్ర





# ఇండియా కూటమి ర్యాలీలో ఉద్రిక్తత

- పోలీసుల లాఠీఛార్జ్‌తో కలకలం
- తొక్కిసలాటలో కిందపడిన పలువురు నేతలు
- తెలంగాణ నాయకులకు స్వల్ప గాయాలు
- సుప్రీంకోర్టు మార్చ్ సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు

ఢిల్లీ, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి చేపట్టిన ర్యాలీ ఉద్రిక్తతకు దారితీసింది. సుప్రీంకోర్టు వైపు సాగిన నిరసన ప్రదర్శనను ఢిల్లీ పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో లాఠీఛార్జ్, తొక్కిసలాట చోటుచేసుకున్నట్లు సమాచారం. ర్యాలీలో పాల్గొన్న పలువురు నాయకులు కిందపడగా, తెలంగాణకు చెందిన కొందరు నేతలకు స్వల్ప గాయాలయ్యాయని తెలుస్తోంది. అయితే గాయపడిన వారి పేర్లు, సంఖ్య, వారి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఇండియా కూటమి సోమవారం దిల్లీలో 'చలో దిల్లీ' పేరుతో నిరసన మార్చ్ చేపట్టింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సహా పలువురు విపక్ష నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కన్నాట్ ప్లేస్ నుంచి సుప్రీంకోర్టు వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. సుప్రీంకోర్టు సమీపంలోని భగవాన్ దాస్ రోడ్డులో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించిన నాయకులు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామాలతో అక్కడ ఉద్రిక్తత పెరిగింది. ర్యాలీని అడ్డుకునే క్రమంలో పోలీసులు లాఠీఛార్జ్ చేశారన్న సమాచారం నేపథ్యంలో నిరసనకారులు ఒక్కసారిగా చెల్లాచెదురైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగి పలువురు నాయకులు, కార్యకర్తలు కిందపడినట్లు సమాచారం. తెలంగాణకు చెందిన నాయకులు కూడా ఈ ఘటనలో గాయపడినట్లు వచ్చిన వివరాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. అయితే ఈ లాఠీఛార్జ్, తొక్కిసలాటకు సంబంధించిన పూర్తి వివరాలు, పోలీసులు తీసుకున్న చర్యలు, గాయపడిన వారికి అందించిన వైద్యసాయం గురించి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. నిరసనలో పాల్గొన్న వారి సంఖ్య, ఘటన జరిగిన కచ్చితమైన పరిస్థితులపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల సంఘం తీరుపై విపక్షాలు గత కొన్ని రోజులుగా నిరసనలు కొనసాగిస్తున్నాయి. ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయని ఇండియా కూటమి నాయకులు ఆరోపిస్తుండగా, ప్రధాన ఎన్నికల మిగతా 2లో..

# ఎల్‌నినోను సమష్టిగా ఎదుర్కోవాలి

- తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ప్రపంచ వ్యాప్తంగా తాగు, సాగు నీటి సమస్య, విద్యుత్ సమస్యలు తలెత్తే అవకాశం
- నీటి లభ్యతను బట్టి యాసంగి పంటల సాగుపై రైతులు నిర్ణయం తీసుకోవాలి
- నీరు అందుబాటులో లేకుంటే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- పశుసంపదనూ కాపాడుకోవాలి.. మేత, తాగునీటి ఏర్పాట్లు చేయాలి
- కష్టకాలంలో అధికారులకు సహకరించాలి.. వారి సూచనలను రైతులు పాటించాలి
- గ్రామాల్లో ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొన్నం సూచన

హైదరాబాద్/సుల్తానాబాద్, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

సూపర్ ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందని, అనేక ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తే పరిస్థితులు ఉన్నాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులతో మాట్లాడి యాసంగి 2026–27 పంటల సాగు ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు.



సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలోని రైతు వేదిక నుంచి నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలోని రైతు వేదికల నుంచి రైతులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోవడం, సాగునీటి మిగతా 2లో..

# సామాన్యులకు అందుబాటులోకి కామన్ పాస్ ధరలు!

- ఆర్టీసీ–మెట్రో పాస్ ఛార్జీల పునఃపరిశీలనకు ప్రభుత్వం నిర్ణయం
- ప్రజల ఫిర్యాదులపై స్పందన..
- త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం
- మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్ ఛార్జీలను పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న కామన్ పాస్ ధరలు అధికంగా ఉన్నాయంటూ ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలను, వాస్తవ మిగతా 2లో..



# గతంలో కొత్త ఫామ్-6పై తీర్పు ఇవ్వలేదు

- ఎన్నికల సంఘం ప్రకటనపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- మార్పులు ఎవరు చేశారో పరిశీలిస్తామని స్పష్టీకరణ
- బిహార్ ఓటర్ల జాబితా సవరణపై విచారణ
- గత తీర్పులో కొత్త ఫామ్-6 అంశమే లేదని వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

బిహార్ ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి కొత్త ఫామ్–6పై తాము ఎలాంటి తీర్పు ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతంలో వెలువరించిన తీర్పులో కొత్త ఫామ్–6 అంశమే తమ ముందుకు రాలేదని వెల్లడించింది. వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో భాగంగా ఉపయోగిస్తున్న ఫామ్–6లో చేసిన మార్పులను అత్యున్నత న్యాయస్థానం ఆమోదించిందంటూ ఎన్నికల సంఘం చేసిన ప్రకటనపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ దరఖాస్తులో మార్పులు ఎవరు చేశారు, ఏ ప్రాతిపదికన చేశారనే విషయాలను రికార్డులు పరిశీలించి తేలుస్తామని పేర్కొంది. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఉటంకించే సమయంలో వాస్తవాలను సరిగ్గా ప్రస్తావించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, కొత్త ఫామ్–6కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం పేర్కొన్న విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఎన్నికల సంఘం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపిస్తూ, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, కొత్త ఫామ్–6పై ఎలాంటి న్యాయ నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. బిహార్ ఓటర్ల జాబితాల సవరణపై గతంలో విచారణ జరిగిన సమయంలో ఈ కొత్త దరఖాస్తు అంశం తమ పరిశీలనకు రాలేదని వివరించారు.

బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణ వ్యవహారంలో మే నెలలో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఆ తీర్పులో ఫామ్–6ను ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన ధ్రువీకరణ ప్రక్రియలో మార్గదర్శకంగా ప్రస్తావించింది. అప్పట్లో బిహార్‌లో ఉపయోగించిన ఫామ్–6 దరఖాస్తుల పరిశీలనకు ఒక విధానాన్ని నిర్దేశించినట్లు వివరించింది. ధ్రువీకరణ ప్రక్రియకు స్పష్టమైన మార్గదర్శకాలు లేకుండా మొత్తం వ్యవహారాన్ని అధికారుల వ్యక్తిగత నిర్ణయాలపై వదిలేయడం ఆచరణ సాధ్యం మిగతా 2లో..

# ఓట్లు తొలగించారని నిరూపించండి!

- పొన్నం ప్రభాకర్ సవాల్‌ను స్వీకరిస్తున్నా
- కనీసం పది మంది ఓటర్లను తీసుకురండి.. సీఈవో కార్యాలయం వద్దే తేల్చుకుందాం
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

ఓట్లు తొలగించారంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ప్రకటించారు. మంత్రి ఏ సమయానికి వస్తారో చెబితే రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) కార్యాలయానికి తాను వస్తానని అన్నారు. ఓట్లు తొలగించబడ్డాయని చెబుతున్న కనీసం పది మంది ఓటర్లను తీసుకురావాలని, వారి వివరాలను అక్కడికక్కడే కంప్యూటర్లలో పరిశీలించి వాస్తవాలు తేల్చుకుందామని సవాల్ విసిరారు.

### పది మంది ఓటర్ల వివరాలు చూపించండి

అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారని నిరూపించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ముం



దస్తు నోటీసులు ఇవ్వకుండా, క్షేత్రస్థాయి విచారణ చేపట్టకుండా ఓటర్ల పేర్లను తొలగించే అవకాశం లేదని పేర్కొన్నారు. ఓటు మిగతా 2లో..

# సర్ పేరుతో ఎన్నికల అక్రమాలు!

- బీజేపీ మాత్రమే గెలిచేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి
- ఓటు హక్కు చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ సత్యాగ్రహం
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే మా పోరాటం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



2లో..

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి:2 | సంచిక: 145
మంగళవారం 13 అక్టోబర్, 2026

## ఓట్లు తొలగించారని నిరూపించండి!

(మొదటి పేజీ తరువాయి)

తొలగింపుపై ఆరోపణ లు చేస్తున్న వారు ఆధారాలతో ముందుకు రావాల ని అన్నారు. ఈ అంశంపై మంత్రి పొన్నం ప్రభాక ర్‌తో బహిరంగంగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నా నని స్పష్టం చేశారు.

**ప్రజా సమస్యలను పక్కనపెట్టి ఢిల్లీ పర్యటనలా?**

రాష్ట్రంలో ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించాల్సి న మంత్రులు ఢిల్లీకి వెళ్లారని రాంచందర్‌రావు విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు.

**రాముడిపై కాంగ్రెస్ వ్యాఖ్యలపై విమర్శలు**

గోవాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీని 'రావణుడు', కాంగ్రెస్‌ను 'రాముడు'గా అభివర్ణించడంపై రాంచందర్‌రావు తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ పాలనలో అత్యవసర పరిస్థితి విధించడం, అమాయకులను జైళ్లలో నిర్బంధించడం వంటి ఘటనలను ప్రస్తావిస్తూ ఆ పార్టీ వైఖరిని విమర్శించారు. అయోధ్య రామమందిర నిర్మాణానికి సంబంధించి గతంలో కాంగ్రెస్ అనుసరించిన వైఖరిపైనా ప్రశ్నలు సంధించారు. రాముడిని రాజకీయ ప్రయోజనాల కోసం ప్రస్తావించడం, దేవుళ్లను వర్గాలుగా విభజించే వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు మతపరమైన అంశాలను రాజకీయాలకు ఉపయోగించుకోవడం మానుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలో మతపరమైన వ్యాఖ్యలు చేశారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ నేతలు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాముడి పేరుతో రాజకీయాలు చేయడం కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని రాంచందర్‌రావు కాంగ్రెస్ నాయకులకు సూచించారు.

## ఎస్ఐఆర్ పేరుతో ఎన్నికల అక్రమాలు!

హైదరాబాద్, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియ పేరుతో ఎన్నికల కమిషన్ ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్యంలో బీజేపీ మాత్రమే గెలిచే పరిస్థితులు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. దేశ పౌరుల ఓటు హక్కును పరిరక్షించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు సోమవారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు బలమైన పునాది అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రాథమిక హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గత కొంతకాలంగా దేశ ప్రజల దృష్టికి తీసుకెళ్తున్నారని తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ఈ పోరాటం కాంగ్రెస్ పార్టీ లేదా ఆ పార్టీ నాయకుల ఓట్ల కోసం మాత్రమే కాదని, దేశంలోని ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటం కోసమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**గాంధేయ మార్గంలో సత్యాగ్రహం**

ఓటర్ల హక్కుల సమస్యలను రాజ్యాంగ సంస్థల దృష్టికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ గతంలోనూ ప్రయత్నించిందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రపతిని కలిసి వినతులు సమర్పించడంతోపాటు సంబంధిత వ్యవస్థలకు ఈ అంశాలను వివరించామని చెప్పారు. ఇందులో భాగంగానే మరో రాజ్యాంగ వ్యవస్థ దృష్టికి ఓటు హక్కుల పరిరక్షణ అంశాన్ని తీసుకెళ్లేందుకు ఢిల్లీలో శాంతియుతంగా, గాంధేయ మార్గంలో సత్యాగ్రహం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

## ఢిల్లీ నిరసనలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో తెలంగాణ నుంచి మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఎంపీలు, సీనియర్ నాయకులు నిరసనలో పాల్గొన్నారని తెలిపారు. మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ తదితర అనుబంధ సంఘాల నాయకులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు అందరూ ఐక్యంగా ముందుకు రావాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

# ఎల్‌నినోను సమష్టిగా ఎదుర్కోవాలి

(మొదటి పేజీ తరువాయి)

లభ్యత పరిమితంగా ఉండటంతో రైతులు యాసంగి 2026–27 పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో సాగుకు దూరంగా ఉండాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాదని, ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతోందని తెలిపారు. అనేక ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, విద్యుత్ లభ్యతకు సంబంధించిన సమస్యలు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకోవడం, ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వాస్తవాలను అర్థం చేసుకుని, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితిని బట్టి పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సాగునీరు అందుబాటులో ఉంటుందనే అంచనాతో అధిక నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేసి నష్టపోకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

**తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తూ, రానున్న జూన్ వరకు తాగునీటి అవసరాలను తీర్చేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తాగునీటి పథకాల్లో సమస్యలు తలెత్తితే వెంటనే మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సాగునీటి లభ్యత తక్కువగా ఉండటంతో పాటు భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గిన నేపథ్యంలో రైతులు సాగు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలను పాటిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాతావరణ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**పశుసంపదనూ కాపాడుకోవాలి**

కష్టకాలంలో మనుషుల అవసరాలతో పాటు పశుసంపదను కూడా రక్షించుకోవడం అత్యంత ముఖ్యమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. పశువులకు తగినంత తాగునీరు, మేత అందుబాటులో ఉండేలా పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పశువులకు నీటి తొట్లు ఏర్పాటు చేయడంతో పాటు మేత కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కోవడం ఒక్క శాఖతో సాధ్యం కాదని, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు సమష్టిగా పనిచేయాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కష్టకాలంలో అధికారులకు సహకరించాలని, వారు అందించే సూచనలు, సలహాలను పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం గత ఫిబ్రవరి నుంచే రైతులకు అవగాహన కల్పిస్తోందని తెలిపారు. ముందస్తు అవగాహన, ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రభుత్వం చేసిన ప్రయత్నాల ఫలితంగా సుమారు 10 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గిందని, మహబూబ్‌నగర్ ప్రాంతంలో కూరగాయల సాగు పెరిగిందని వివరించారు. యాసంగిలో అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుపై రైతులు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వరి పంటకు అధిక ధర లభిస్తోందనే ఆశతో సాగు చేస్తే, నీటి కొరత కారణంగా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పప్పు ధాన్యాలు, నూనెగింజలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతుల వినియోగాన్ని పెంచేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. రైతులు తప్పుదోవ పట్టించే ప్రచారాన్ని నమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సూచనలు, అందుబాటులో ఉన్న నీటి వివరాల ఆధారంగా పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో యూరియా, విత్తనాల లభ్యతకు ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, వర్షపాతం తగ్గి, కరువు పరిస్థితులు మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఈ ప్రభావం మరింత బలపడవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాధారణం కంటే 20 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఖరీఫ్ సాగు విస్తీర్ణం 15 శాతం తగ్గిందని వివరించారు. పత్తి, వరి పంటలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, భూగర్భ జలాల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని తెలిపారు. 30 టీఎంసీల సామర్థ్యం ఉన్న సింగూరు జలాశయంలో సుమారు 4 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 20 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసినప్పటికీ, దేశవ్యాప్తంగా విద్యుత్ కొరత నెలకొన్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. రైతు భరోసా కింద 75 లక్షల మంది రైతులకు రూ.8,500 కోట్ల నిధులు విడుదల చేశామని, లక్ష ఎకరాలకు స్ప్రింక్లర్లు పంపిణీ చేశామని, ఖరీఫ్‌లో సబ్సిడీ విత్తనాలు అందించామని వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీరు, పశువుల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని, 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలను తీర్చేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. కృష్ణా బేసిన్‌లో సుమారు 270 టీఎంసీలకు గాను 80 టీఎంసీలు, గోదావరి బేసిన్‌లో సుమారు 100 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జలాశయాల్లోని లైవ్ స్టోరేజీ నీటిని ఈ ఏడాది సాగునీటి కోసం వినియోగించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.

**ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలి**

కరువు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి సమస్యలు తలెత్తకుండా ఉపాధి హామీ పథకం కింద పనులను విస్తృతంగా చేపట్టాలని సీఎస్ సూచించారు. గత ఏడాది రోజుకు సగటున 25 వేల మంది కూలీలు పనులకు హాజరుకాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2.5 లక్షలకు చేరిందని తెలిపారు. నెలాఖరుకు రోజువారీ కూలీల హాజరును 5 లక్షలకు పెంచేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు పని కల్పించేలా నీటి సంరక్షణ పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత, నీటి నిల్వ నిర్మాణాలు, ఫామ్ పాండ్స్, వ్యక్తిగత, సామూహిక సోక్ పిట్ల నిర్మాణం వంటి పనులను చేపట్టాలని సూచించారు. పశువులకు మేత అందుబాటును పెంచే పనులను కూడా ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టాలని తెలిపారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించి పనులను పర్యవేక్షించాలని, ప్రతి గ్రామీణ నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. అక్టోబర్ 2న గ్రామపంచాయతీల్లో రూపొందించిన ప్రత్యేక ప్రణాళికల ఆధారంగా పనులను వేగవంతం చేయాలని, మార్చి 2027 వరకు ఉపాధి హామీ పథకం ద్వారా అదనంగా రూ.6,500 కోట్ల మేర పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

**సింగూరు పరిధిలో తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ప్రణాళిక**

పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ,* సింగూరు పరిధిలోని 19 పట్టణాలు, సుమారు 2 వేల ఆవాసాలకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు డిసెంబర్ 10 వరకు అవసరాలు తీర్చేందుకు సరిపోతుందని, ఆ తర్వాత కూడా సరఫరాలో ఇబ్బందులు రాకుండా రూ.110 కోట్లతో ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించామని, ఈ వారంలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు, అక్టోబర్‌లో జిల్లాల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ అమలు చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి ప్రసాద్, డిసి ఓ శ్రీ మాల, ఎస్సీ ఎన్పీడీసీఎల్ గంగాధర్ ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు రూ.40 వేల విలువైన ఉచిత కోచింగ్!

హైదరాబాద్, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు అండగా నిలిచేందుకు 'పొంగులేటి శీనన్న యువనేస్తం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఒక్కో అభ్యర్థికి రూ.40 వేల విలువైన ఆన్‌లైన్ కోచింగ్‌ను ఏడాది పాటు ఉచితంగా అందించనున్నారు. నేటి నుంచే రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ఆర్‌సీ ఎగ్జామ్స్ భాగస్వామ్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతీ యువకులు https://psryuvanestham.in/ వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని రిజిస్టర్ చేసుకోవచ్చు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఏడాది పాటు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ అందిస్తారు.

**పలు పోటీ పరీక్షలకు శిక్షణ**

గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, ఎస్సై, కానిస్టేబుల్, పంచాయతీరాజ్, అటవీ శాఖ, రైల్వే, బ్యాంకింగ్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా శిక్షణ ఇవ్వనున్నారు. అన్ని సబ్జెక్టుల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నారు.

**ఉద్యోగార్థులకు ఆర్థిక భరోసా**

ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన యువత ఉద్యోగ అవకాశాలకు దూరం కాకూడనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఖరీదైన కోచింగ్ పొందలేని నిరుద్యోగ యువతకు ఉచితంగా నాణ్యమైన శిక్షణ అందించి, ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో తోడ్పడటమే 'పొంగులేటి శీనన్న యువనేస్తం' ప్రధాన ఉద్దేశం.

# విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ఘోర ప్రమాదం

## ఈవీ కారులో మంటలు..

## నలుగురు సజీవదహనం

**మరొకరి పరిస్థితి విషమం**

**ఫంక్షన్‌కు వెళ్లి తిరిగొస్తుండగా ఘటన**

**మృతుల కుటుంబాల్లో విషాదఛాయలు**



విజయవాడ, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో నలుగురు సజీవదహనమయ్యారు. ఈ ఘటనలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదంతో ఆ ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించడంతోపాటు ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ ప్రమాదంలో నున్నకు చెందిన కొమ్మారెడ్డి రాందేవ్ (39), ఆయన తల్లి కొమ్మారెడ్డి అరుణ, ఓ చిన్నారి, నంబూరుకు చెందిన తిగురు విజయ ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. ఒకే కుటుంబానికి చెందినవారు ప్రమాదంలో చిక్కుకోవడంతో స్థానికంగా విషాదం నెలకొంది. కారు మంటల్లో చిక్కుకున్న సమయంలో బయటపడే అవకాశం లేకపోవడంతో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. అయితే మంటలు ఎలా చెలరేగాయి, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులేమిటనే అంశాలపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు కూడా అక్కడికి చేరుకొని సహాయక చర్యల్లో భాగస్వాములయ్యారు. కారులో మంటలు చెలరేగిన తీరు, ప్రాణనష్టం తీవ్రతతో ఘటనా స్థలంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, ప్రత్యక్ష సాక్షుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. మృతులు నంబూరులో జరిగిన ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగినట్లు సమాచారం. కార్యక్రమం ముగించుకొని ఇంటికి చేరుకుంటారనుకున్న కుటుంబ సభ్యులకు ఈ ప్రమాదం తీరని విషాదాన్ని మిగిల్చింది. సమాచారం అందుకున్న మృతుల బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. అప్పటివరకు తమతో కలిసి ఉన్నవారు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారనే విషయం తెలుసుకొని వారు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చిన్నారి సహా నలుగురు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టే అవకాశం ఉంది. విద్యుత్ కారులో మంటలు చెలరేగడానికి సాంకేతిక లోపం కారణమా, ఢీకొనడం వల్ల మంటలు వ్యాపించాయా, లేక ఇతర కారణాలున్నాయా అనే విషయాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. అగ్నిమాపక సిబ్బంది చేపట్టిన చర్యలు, పోలీసుల ప్రాథమిక పరిశీలన అనంతరం ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ ఘటన మరోసారి రహదారి భద్రత, వాహనాల్లో అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై ఆందోళన కలిగిస్తోంది.



## ఎస్ఐఆర్ పేరుతో ఓటు చోరీకి కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**13 కోట్ల ఓట్లు తొలగించారన్న సీఎం**

2014లో దేశంలో సుమారు 81 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 2019లో 91 కోట్లు, 2024 ఎన్నికల నాటికి సుమారు 97 కోట్లకు చేరారని రేవంత్‌రెడ్డి వివరించారు. 2026లో ఇప్పటికే 13 కోట్ల ఓట్లు తొలగించారని, ఈ సంఖ్యను 20 కోట్లకు పెంచే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జనాభా పెరుగుతున్న సమయంలో ఓటర్ల సంఖ్య తగ్గడానికి కారణమేంటో ఎన్నికల సంఘం వివరించాలని కోరారు. ఈ గణాంకాలు, ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

**రాహుల్‌గాంధీతో కలిసి పోరాలి**

ఓటు హక్కు ఉన్నవారు, లేనివారంటూ దేశంలో రెండు వర్గాలు ఏర్పడే పరిస్థితిని అడ్డుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా, ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ నేతృత్వంలో సాగుతున్న పోరాటంలో కాంగ్రెస్, ఇండియా కూటమి భాగస్వాములు ఐక్యంగా ముందుకు సాగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమి ర్యాలీలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా విపక్ష నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తాజా వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఎన్నికల సంఘానికి సంబంధించిన రికార్డులను వెల్లడించాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పరిశీలించేందుకు స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరినట్లు సమాచారం. ర్యాలీలో చోటుచేసుకున్న పరిణామాలు నిరసనల నిర్వహణ, పోలీసుల చర్యలు, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలకు అనుమతి వంటి అంశాలపై మరోసారి చర్చకు దారితీశాయి. తెలంగాణ నేతలకు గాయాలయ్యాయన్న సమాచారంపై వారి పార్టీ వర్గాల నుంచి స్పష్టమైన వివరాలు రావాల్సి ఉంది. అలాగే లాఠీఛార్జ్ ఎప్పుడు, ఏ పరిస్థితుల్లో జరిగిందన్న అంశంపై పోలీసుల అధికారిక వివరణ కీలకం కానుంది. ఎన్నికల సంఘంపై ఆరోపణలు, వాటికి సంబంధించిన న్యాయపోరాటం ఒకవైపు కొనసాగుతుండగా, ఢిల్లీలో నిరసనల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలపై తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

## గతంలో కొత్త ఫామ్-6పై తీర్పు ఇవ్వలేదు: సుప్రీంకోర్టు

(మొదటి పేజీ తరువాయి)

కాదని అభిప్రాయపడింది. ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం రూపొందించిన ఫామ్–6, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఉండాలని గత తీర్పులో పేర్కొన్నట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. అయితే ఆ తీర్పులో కొత్తగా మార్చిన ఫామ్–6కు ప్రత్యేకంగా ఆమోదం తెలిపినట్లు అర్థం చేసుకోరాదని తాజా విచారణలో ధర్మాసనం స్పష్టం చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో దరఖాస్తుల రూపకల్పన, వాటి ద్వారా ఓటర్ల వివరాలను ధ్రువీకరించే విధానం కీలకంగా మారాయి. ఫామ్–6లో చేసిన మార్పులు, వాటి అమలుకు అనుసరించిన విధానంపై వివాదం తలెత్తడంతో ఈ అంశం న్యాయస్థానం దృష్టికి వచ్చింది. ఒక దరఖాస్తు నమూనాను గత తీర్పులో ప్రస్తావించడం, తరువాత చేసిన మార్పులకు న్యాయస్థానం ఆమోదం తెలిపినట్లుగా భావించడం వేర్వేరు అంశాలని ధర్మాసనం వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ప్రకటనకు ఆధారమైన పత్రాలు, దరఖాస్తుల్లో మార్పులు జరిగిన విధానం, వాటికి సంబంధించిన అధికారిక రికార్డులను పరిశీలించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వివరాల ఆధారంగా తదుపరి విచారణలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత, నిబంధనల అమలు, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడటం అత్యంత ముఖ్యమైన అంశాలు. అదే సమయంలో అనర్హుల పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు వంటి ప్రక్రియలు చట్టబద్ధమైన విధానాల ప్రకారమే జరగాల్సి ఉంటుంది. ఫామ్–6కు సంబంధించి సుప్రీంకోర్టు తాజాగా చేసిన స్పష్టీకరణతో ఎన్నికల సంఘం ప్రకటనపై మరింత పరిశీలన అవసరమైంది. దరఖాస్తుల్లో మార్పులు ఎవరు చేశారనే అంశంపై రికార్డుల పరిశీలన అనంతరం ధర్మాసనం ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన పిటిషన్‌పై తదుపరి విచారణలో ఈ అంశం కీలకంగా మారే అవకాశం ఉంది.

## సామాన్యులకు అందుబాటులోకి కామన్ పాస్ ధరలు!

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్ ధర రూ.400గా ఉందని, ఇందులో మెట్రో వాటా రూ.300, ఆర్టీసీ వాటా రూ.100గా నిర్ణయించారని మంత్రి వివరించారు. నెలవారీ పాస్ ధర రూ.8,500 కాగా, మెట్రో వాటా రూ.7,000, ఆర్టీసీ వాటా రూ.1,500గా ఉందన్నారు. ఈ ధరలు సామాన్యులకు భారంగా ఉన్నాయనే అభిప్రాయాల నేపథ్యంలో పునఃసమీక్ష చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు కామన్ పాస్ ఛార్జీలపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు.

https://epaper.vaarthavedikasurya.com
PRGI NO: TGTEL/25/A0305
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY





# యాదాద్రి భువనగిరి

# భూనిర్వాసితులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి

## సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ డిమాండ్

**భువనగిరి రూరల్, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):**



భువనగిరి మండల బస్వాపురం ప్రాజెక్టు (నృసింహసాగర్ రిజర్వాయర్) నిర్మాణంలో భూములు కోల్పోయిన పేద రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అధికారి (DRO) గారిని కలిసి నిర్వాసిత రైతులతో పాటు సీపీఎం బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ భువనగిరి మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో నిర్మిస్తున్న రిజర్వాయర్ కోసం సర్వే నెంబర్ 229 లో గల 110 ఎకరాల 24 గుంటల ప్రభుత్వ భూమిని సేకరించారని తెలిపారు. తరతరాలుగా ఈ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న 97 మంది పేద రైతులు ప్రాజెక్టు కారణంగా ప్రస్తుతం ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అప్పటి జిల్లా కలెక్టర్ అనితా రామచంద్రన్ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, సదరు భూమిని సాగు చేసుకుంటున్న 97 మంది రైతులకు నష్టపరిహారానికి పూర్తి అర్హత ఉన్నట్లు గుర్తించారని ఆయన గుర్తు చేశారు. అధికారులు నివేదికలు తయారు చేసి ఏళ్లు గడుస్తున్నా, జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా ఇంతవరకు రైతులకు పైసా నష్టపరిహారం అందలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయగిరి రెవెన్యూ పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సర్వే నెం. 259 లోని ప్రభుత్వ భూమి నుండి ప్రాజెక్టు కాలువ తీసినప్పుడు, అక్కడ సాగు చేసుకుంటున్న వారికి ప్రభుత్వం ఏ విధంగానైతే నష్టపరిహారం చెల్లించిందో, అదే జీవో ప్రకారం బస్వాపురం బాధితులకు కూడా వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత రైతుల పట్ల జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహశీల్దార్‌లు దాటవేత ధోరణి వీడాలని, బాధితులకు ఎందుకు స్పష్టమైన హామీ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అధికారులు కేవలం దరఖాస్తులు తీసుకోవడమే తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. రైతుల సమస్య పరిష్కారానికి ఇంకెంత కాలం పడుతుందని జిల్లా యంత్రాంగాన్ని నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి నష్టపరిహారం విడుదల చేయాలని, లేనిపక్షంలో బాధితులతో కలిసి బస్వాపురం ప్రాజెక్టు పనులను అడ్డుకుంటామని, ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కమిటీ సభ్యులు మద్యపురం బాల్ నర్సింహ, సీపీఎం నాయకులు దయ్యాల మల్లేష్‌తో పాటు భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులు ఉడత విష్ణు, మచ్చ వెంకట్ నర్సయ్య, ఏనబోయిన విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### బంజారాహిల్స్‌లో గత నెల రోజులుగా లైన్‌మన్ లేక ఇబ్బందులు – ఖాళీ పోస్టును వెంటనే భర్తీ చేయాలి



**భువనగిరి టౌన్ అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):**

భువనగిరి మున్సిపల్ పరిధిలోని 31వ వార్డు బంజారాహిల్స్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని కోరుతూ 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు గారికి వినతి పత్రం అందజేశారు. గత నెల రోజులుగా బంజారాహిల్స్ ప్రాంతంలో విద్యుత్ శాఖకు సంబంధించిన లైన్‌మన్ లేకపోవడంతో ప్రజలు విద్యుత్ సమస్యల పరిష్కారంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పుడు, విద్యుత్ లైన్లలో మరమ్మతులు అవసరమైనప్పుడు సమస్యలను సకాలంలో పరిష్కరించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్ ప్రాంతానికి వెంటనే లైన్‌మన్‌ను నియమించి, ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేయాలని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు గారిని కోరారు. ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సేవలు అందించడంతో పాటు, విద్యుత్ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 31వ వార్డులో విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ సరఫరా వ్యవస్థను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరారు. ప్రజలకు విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు ఎదురుకాకుండా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, వార్డులో మౌలిక సదుపాయాల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తానని కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్ పేర్కొన్నారు. బంజారాహిల్స్ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి, లైన్‌మన్ పోస్టును భర్తీ చేయడంతో పాటు విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో, బానోత్ జ్యోతి, బానోత్ సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

### రైతునేస్తం వీసీలో అధికారుల సూచన

**ఆత్మకూరు (ఎం), అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):**



యాదాద్రి భువనగిరి జిల్లా యాసంగి 2026–27 సీజన్‌లో నీటి లభ్యతను బట్టి రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని, వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూచించారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని పల్లెర్ల రైతువేదికలో నిర్వహించిన 'రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున, భూగర్భ జలాల లభ్యతను పరిగణనలోకి తీసుకుని రైతులు పంటలను ఎంచుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వరికి ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం వల్ల సంభవించే వాతావరణ మార్పులను వివరించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగుకు అనువైన విత్తన కాలాలు, తగిన పంట రకాలపై రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శైలేందర్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సూపరింటెండెంట్ లోకేశ్వర్ రెడ్డి, సర్పంచ్ తండ మంజుల నర్సింహాగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ కోడిత్యాల పద్మా నరేందర్ గుప్తా, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం. అశోక్ కుమార్, రాజశేఖర్, వేణు, సౌమ్య, క్రాంతి, ఉప సర్పంచ్ సారయ్య, వార్డు సభ్యులు మరియు రైతులు మల్లారెడ్డి, రామలక్ష్మయ్య, దయాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పాపయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం ఒక కుటుంబానికి భరోసాగా



**రామన్నపేట, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):**

రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన భువనగిరి కృష్ణ, S/o శ్రీశైలం గారికి 20,000/– రుపాయలు నకిరేకల్ శాసన సభ్యులు, ★ప్రభుత్వ విప్ శ్రీ వేముల వీరేశం ప్రత్యేక చొరవతో వారి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అత్యవసర చికిత్స నిమిత్తం విలువైన చెక్కును ఎమ్మెల్యే ఆదేశానుసారం రామన్నపేట విశ్రాంతి భవనంలో రామన్నపేట మండలం అధ్యక్షులు పున్న జగన్మోహన్ గారు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి మరియు రామన్నపేట మాజీ ఎంపీపీ పూస బాలమణి బాల నరసింహ చేతుల మీదుగా చెక్కును అందజేయడం జరిగింది.

# మహిళలను అవమానించిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

### ఎమ్మార్పీఎస్ తీవ్ర ఆగ్రహం!
### టి.రేపాకలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 'ఆత్మగౌరవ చైతన్య సమావేశం', భారీ ర్యాలీ
### అత్యంత కఠినంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్

**ఆత్మకూరు (ఎం), అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):**



యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గం, ఆత్మకూరు (ఎం) మండల పరిధిలోని టి.రేపాక గ్రామంలో తెలంగాణ సాంప్రదాయ పండుగ 'ఎంగిలిపూల బతుకమ్మ' వేడుకల సందర్భంగా దళిత మహిళలను అవమాన పరిచిన వ్యక్తులపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ తీవ్రస్థాయిలో డిమాండ్ చేసింది.ఈ సంఘటనపై సమాచారం అందుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు టి.రేపాక గ్రామంలోని దళితవాడను సందర్శించి, బాధితులైన మహిళలను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో 'దళితుల ఆత్మగౌరవ చైతన్య సమావేశం' ఏర్పాటు చేసి, భారీ'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు.సభ్య సమాజం తలదించుకునేలా వివక్ష! ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్, ఆలేరు నియోజకవర్గం ఇంచార్జి నల్ల చంద్రస్వామి మాట్లాడుతూ.. "75 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో, ఆధునిక యుగంలో కూడా ఇటువంటి వివక్ష చూపించే ఘటనలు జరగడం సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. ఆడబిడ్డల పండుగ బతుకమ్మ వేడుకల్లో సంతోషంగా పాల్గొంటున్న దళిత మహిళలను అవమానించడం అత్యంత హేయం" అని మండిపడ్డారు.పెద్ద ఎత్తున నిరసనలకు పిలుపు ఇస్తాం బాధితులకు అట్రాసిటీ చట్టం కింద పూర్తి న్యాయం జరగాలని, నిందితులను వెంటనే జైలుకు పంపాలని నాయకులు హెచ్చరించారు. లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. దళితుల ఆత్మగౌరవ పోరాటంలో ఎమ్మార్పీఎస్ ఎల్లప్పుడూ ముందువరసలో ఉండి బాధితులకు అండగా పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ నిరసన, ఆత్మగౌరవ ర్యాలీలో ఎమ్మార్పీఎస్ పూర్వ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సమాఖ్య నాయకులు ఏనుతుల బన్నీ, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గురుకు యాదగిరి, ఎమ్ఎస్పీ మండల అధ్యక్షుడు జిట్టా యాదగిరి, సీనియర్ నాయకులు యాతల రఘు, గ్రామ నాయకులు, మాజీ సర్పంచులు ఏనుతుల రాములు, ఇతర ముఖ్య నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమరుడు లింగయ్య ఆశయ సాధనలో తనయులు

### తండ్రి సేవలను సజీవంగా నిలుపుతున్న నవీన్, ప్రవీణ్ ల ఉదారత!
### మానవత్వానికి నిలువుటద్దం ఘర్షకోట లింగయ్య: వర్ధంతి వేళ గంభీరంగా సేవా కార్యక్రమాలు

**ఆత్మకూరు (ఎం), అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):**



తన శ్రమనే నమ్ముకుని, పదిమందికి నీడగా నిలిచిన హమాలి నాయకుడు, అమరజీవి ఘర్షకోట లింగయ్య భౌతికంగా మన మధ్య లేకపోయినా.. ఆయన నింపిన ఆశయాలు, చూపిన సేవామార్గం గ్రామంలో నేటికీ చిరస్మరణీయంగా విరాజిల్లుతున్నాయి! యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల పరిధిలోని పల్లెర్ల గ్రామానికి చెందిన హమాలి నాయకులు ఘర్షకోట లింగయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి సుపుత్రులు నవీన్, ప్రవీణ్ తోడల్లుళ్ళుగా, తండ్రి బాటలోనే నడుస్తూ సమాజ సేవలో ఆదర్శంగా నిలిచారు.

**'లింగయ్య ఫౌండేషన్' స్థాపన – తండ్రి జ్ఞాపకాలకు నిలువెత్తు రూపం!**

తండ్రి లేని లోటును తీర్చుకుంటూనే, ఆయన ఆశయాలను ఊపిరిగా మలచుకున్న నవీన్, ప్రవీణ్ ప్రత్యేకంగా "లింగయ్య ఫౌండేషన్" ను స్థాపించి కళ్ళు చెమర్చేలా ఊరికి అండగా నిలిచారు. తండ్రి ప్రథమ వర్ధంతి జ్ఞాపకార్థం గ్రామంలోని యువత ఉత్సాహాన్ని పెంపొందించేందుకు టీ-షర్టులు, క్రీడా/సాంస్కృతిక ప్రోత్సాహకంగా సౌండ్ బాక్సులను అత్యంత వైభవంగా ప్రదానం చేశారు.

**'మీరు లేకున్నా.. మా మదిలో ఎప్పటికీ సజీవమే!'**

"రూపం మారినా.. మీరు నేర్పిన మంచితనం మారదు" అని చాటిచెబుతూ, తమ తండ్రి భౌతికంగా దూరం అయినా ప్రతి ఒక్కరి మదిలో, తమ కంటిపాపలా ఎల్లప్పుడూ సజీవంగానే ఉన్నారని ఆయన తనయులు భావోద్వేగానికి లోనయ్యారు. ఒక సామాన్య హమాలి నాయకుడిగా అందరి మన్ననలు పొందిన లింగయ్య జ్ఞాపకార్థం, ఆయన పిల్లలు చేపట్టిన ఈ గొప్ప సేవా కార్యక్రమాలను పల్లెర్ల గ్రామ ప్రజలు, యువత వేనోళ్ల కొనియాడారు. లింగయ్య ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో సేవలు అందించి తండ్రి పేరు ను చిరస్థాయిగా నిలబెడతామని నవీన్, ప్రవీణ్ స్పష్టం చేశారు.

## వార్డెన్ మెస్ ఇంచార్జ్ లను సస్పెండ్ చేయాలి

### అరోరా యూనివర్సిటీ పై ఉన్నత విద్యాధికారితో నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలి
### ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ఆధ్వర్యంలో కళాశాల ముందు ధర్నా



**భువనగిరి టౌన్ అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య):**

భువనగిరి పట్టణంలోని అరోరా యూనివర్సిటీలో విద్యార్థులను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్న హాస్టల్ వార్డెన్ మెస్ ఇన్చార్జి పై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ఇలాంటి చర్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు ఉప్పుల శాంతి కుమార్, పేరబోయిన మహేందర్ అన్నారు కార్పొరేట్ వ్యవస్థలో అరోరా యూనివర్సిటీ పేరుతో విద్యార్థుల వద్ద అక్రమంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు భద్రత లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కళాశాలపై ఉన్నత విద్యాధికారులతో నిజనిర్ధారణ కమిటీ వేయాలని కలెక్టర్ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కందుల మధు ఏ ఐ ఎస్ ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సూరారం జానీ, సుద్దాల సాయికుమార్ నాయకులు నందు ,ప్రణయ్, శ్యాగా జాను, కంబాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**వలిగొండ: అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య)**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్నినో ప్రభావం వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, రబీ సీజన్పై వాటి ప్రభావం, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన పంటల సాగు విధానం పంటల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తగిన పంటలను ఎంపిక చేసుకోవాలని, వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ సాగు ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. అలాగే సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పథకాలు, సూచనలు అమలవుతున్న తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వెల్వర్తి గ్రామంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వీడియో కాన్ఫరెన్స్కు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి, గ్రామ పంచాయతీ సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్ యాదవ్, ఉప సర్పంచ్ బూడిద నాగరాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు దయాకర్, సాయి, కిరణ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి గిరిబాబు, గ్రామ రైతులు, పాల్గొన్నారు.

## శ్రమ దోపిడిని అరికట్టాలి

**భువనగిరి టౌన్, అక్టోబర్ 11 (వార్త వేదిక సూర్య)**



రిలయన్స్ స్మార్ట్ యాజమాన్యం ఉద్యోగుల ,వర్కర్స్ శ్రమ దోపిడిని అరికట్టాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వనం రాజు డిమాండ్ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ లో భువనగిరి సహాయ లేబర్ అధికారి మాడే రాజుకు శ్రమ దోపిడిని అరికట్టాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది అని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పట్టణ కేంద్రంలో ఉన్న రిలయన్స్ స్మార్ట్ లో పనిచేస్తున్న ఉద్యోగుల, వర్కర్స్ నియమించిన పని గంటల కంటే అదనంగా పనిచేయిస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నారనిన్నారు, అదనంగా పని చేయించుకుని అదనంగా వేతనం ఇవ్వకుండా వెట్టి చాకిరి చేస్తున్నారనిన్నారు. నిర్ణయించిన పని గంటల్లోపే పని చేసేటట్లు చర్యలు చేపట్టాలని లేకపోతే డివైఎఫ్ఐ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మద్దె బోయిన సుందరయ్య, మాజీ డివైఎఫ్ఐ నాయకులు చెన్న రాజేష్ పాల్గొన్నారు.

https://epaper.vaarthavedikasurya.com PRGI NO: TGTEL/25/A0305
వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి: 2
సంచిక: 145
మంగళవారం
13 అక్టోబర్, 2026

# ప్రైవేటు ఉపాధ్యాయులకు రక్షణ చట్టం అమలు చేయాలి

## యాజమాన్యం మరియు ఉపాధ్యాయులపై దాడులను అరికట్టాలి.. బి స్మాట్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జలంధర్ రెడ్డి

**భువనగిరి టౌన్ అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):**



ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న యాజమాన్యం మరియు ఉపాధ్యాయులకు రక్షణ చట్టాన్ని అమలు చేయాలని బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడాల జలంధర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయులకు తగిన గౌరవం, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారిపై దాడులు జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ప్రైవేటు యాజమాన్యం మరియు ఉపాధ్యాయులపై జరిగిన దాడుల ఘటనలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. విద్యాబోధన చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులే అభద్రతకు గురికావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై దాడులు జరిగినప్పుడు సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, బాధిత ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రైవేటు యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారి హక్కులకు భరోసా కల్పించాలని కోరారు. విద్యాసంస్థల్లో యాజమాన్యం మరియు ఉపాధ్యాయులకు గౌరవప్రదమైన పని వాతావరణం ఉండాలని, విధి నిర్వహణలో వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.యాజమాన్యం,ఉపాధ్యాయులపై దాడులు, వేధింపులను అరికట్టేందుకు సమర్థవంతమైన రక్షణ వ్యవస్థ అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు రక్షణ చట్టాన్ని అమలు చేయడంతో పాటు వారి ఉద్యోగ భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## అయ్యప్ప సన్నిదానానికి భూమి పూజ



**మోత్కూరు, అక్టోబర్ 12 ( వార్త వేదిక సూర్య):**

మండలంలోని పనకబండ గ్రామంలో అయ్యప్ప స్వామి మాలదారులు గత కొన్నేళ్లుగా దీక్ష సమయంలో స్నానం, వంట, నిద్రపోవడానికి అయ్యప్ప స్వాములు సన్నిధానం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన ఓర్సు డాక్టర్ నర్సింహ్మ కాన్స్ట క్షన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో వారి కుమారులైన వెంకటేష్ పవన్ తేజ సన్నిధానాన్ని నిర్మించుటకు సోమవారం ముందుకు వచ్చారు. ఈ మేరకు అనుకున్నదే తడవుగా గ్రామంలోని అంజనేయులు దేవాలయం పక్కన భూమి పూజ చేశారు. అయ్యప్ప భక్తుల కోసం సన్నిధానం ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన వెంకటేష్ పవన్ తేజ లకు స్థానిక సర్పంచ్ లోతుకుంట రేణుక అనిల్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ ఉపసర్పంచ్ రాధారపు మల్లేశం, మాజీ సర్పంచ్ బత్తిని తిరుమలేష్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పొన్నె బోయిన రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు లోతుకుంట స్వామి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బత్తిని ధర్మయ్య, వివిధ పార్టీ నాయకులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కరువు మండలంగా ప్రకటించాలి

### పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి –రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి



**రామన్నపేట, అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య):**

అకాల వర్షాలు తగ్గిపోవడం, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, రామన్నపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ప్రత్యేక నిధులు కేటాయించాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ లాల్ బహుదూర్‌కు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో వరి, పత్తి తదితర పంటలు సాగు చేసిన రైతులు వర్షాభావ పరిస్థితుల వల్ల తీవ్రంగా నష్టపోయారని అన్నారు. పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టి, ఆశించిన దిగుబడులు రాక రైతులు అప్పుల పాలై దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని, రామన్నపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఇప్పటికే తీసుకున్న పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని, ఎలాంటి కొర్రీలు పెట్టకుండా అర్హులైన రైతులందరికీ కొత్త పంట రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, తక్షణమే స్పందించి రైతులకు న్యాయంచేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

## నూతన పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

### అంచనా రూ.60 లక్షలు

**( యాదాద్రి భువనగిరి బీరు ) అక్టోబర్ 12 వార్తా వేదిక సూర్య:**

యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గం పరిధిలోని వంగపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారబోతున్నాయి. స్థానిక శాసన సభ్యులు బీర్ల ఐలయ్య ప్రత్యేక చొరవతో సుమారు రూ. 60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన నూతన పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రవళి ప్రతాప్ మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఈ నిధులను మంజూరు చేయించారు. ఈ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఆధునిక వసతులతో కూడిన నూతన భవనం అందుబాటులోకి రానుండటం ఎంతో సంతోషదాయకం" అని అన్నారు. పాఠశాల నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ నాయకులు కాంట్రాక్టర్‌కు సూచించారు. గ్రామంలో విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే గారికి ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలరాజు, కాంట్రాక్టర్ ఉదయ్ రెడ్డి గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ముందు నిరసన

### యూనివర్సిటీ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**భువనగిరి, టౌన్ అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):**



భువనగిరి జిల్లా కేంద్రంలో అరోరా యూనివర్సిటీలో డివైఎఫ్ఐ ఇతర విద్యార్థి సంఘాలతో యూనివర్సిటీలో నిరసన ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బురు అనిల్ కుమార్ డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి యం. డి సలీమ్ మాట్లాడుతూ గత బుధవారం అరోరా యూనివర్సిటీలో కళాశాలలో చదువుతున్నటువంటి విద్యార్థినిల వ్యక్తిగత ఫోటోలు మరియు వీడియోలు సోషల్ మీడియాలో రావడం అయ్యాయని పెద్ద ఎత్తున ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తాయి. ఈ విషయంపై కళాశాల డైరెక్టర్ వివరణ కోరగా శనివారం ఆదివారాలు కళాశాలలకు సెలవులు ఉన్నాయని చెప్పి నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం జరిగింది. వెంటనే కళాశాలలో జరిగిన సంఘటనపై విచారణ కమిటీ వేసి నిజానిజాలు నిప్పు చేర్చాల్సిన అవసరం ఉన్నది అలాగే ఈ సంఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా యాజమాన్యం బాధ్యత వహించాలి అని చెప్పి కోరడం జరిగింది. రేగింది సంఘటన జరిగితే ఇప్పటివరకు యాజమాన్యం చోద్యం చేస్తూ చూసి చూడనట్టు వ్యవహరిస్తూ కనీసం పూర్తి స్థాయి ఎంక్వయిరీ కూడా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అని ఆరోపించారు మేము పోయి మాట్లాడితే కళ్ళు బుల్లి మాటలు చెప్పి పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చిన కానీ పోలీసుల నించలే ఎలాంటి సమాచారం రాలేదు అని పైపైకి మాట్లాడుతున్నటువంటి పరిస్థితి కనపడతా ఉంది లక్షల కొద్ది ఫీజులు కట్టి చదువుకుంటున్న విద్యార్థులకు రక్షణ లేకుండా చేస్తున్నటువంటి యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యోజన సమైక్య యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వనం రాజు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు సాజిత్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

## మణిపూర్ కాంగ్రెస్ ఎంపీని బర్తరఫ్ చేయాలి

### కస్తూరి మాధురి చంద్ర బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో భారీ ధర్నా బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని హెచ్చరిక

**యాదాద్రి భువనగిరి వార్తా వేదిక సూర్య:-**



11 మంది విద్యార్థినులపై లైంగిక దాడికి పాల్పడిన మణిపూర్ కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ అంగోమ్చా బిమోల్ అకోయిజంను వెంటనే పార్టీ నుంచి బహిష్కరించాలని బీజేపీ మహిళా మోర్చా డిమాండ్ చేసింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కస్తూరి మాధురి చంద్ర ఆధ్వర్యంలో సోమవారం భువనగిరి పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థినులపై అఘాయిత్యానికి పాల్పడిన ఎంపీ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనాయకత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సదరు ఎంపీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ డౌన్ డౌన్" అంటూ నినదాలు చేశారు. మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కల్పించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని గుర్తుచేశారు. మహిళల గౌరవం, భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, బాధిత విద్యార్థినులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జనగాం కవిత, ఫ్లోర్ లీడర్ వంగేటి సుచరిత, కౌన్సిలర్లు భోజిన శారద, యాస్మిన్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి స్వర్ణలత, ఉపాధ్యక్షురాళ్లు మాధవి, మందుల లక్ష్మి , చిత్రలేఖ, కార్యదర్శి సీత మానస, జిల్లా కార్యవర్గ సభ్యురాలు శరాజీ విజయ, వివిధ మండల, పట్టణ నాయకురాళ్లు ఎంగి ప్రేమలత, భూక్యా మౌనిక, ఆరుట్ల సంగీత, మేడిపల్లి జ్యోతి, ఎషబోయిన లక్ష్మి , అలివేల, పరమేశ్వరి పాల్గొన్నారు.

## 2005 సమాచార హక్కు చట్టం 21 సంవత్సరాలు నేటికీ ఆర్.టి.ఐ

**బీబీనగర్, అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య)**

యాదాద్రి భువనగిరి జిల్లా బిబినగర్ మండల్ సమాచార హక్కు చట్టం 2005 అక్టోబర్ 12 సంవత్సరంలో అమలు బీబీనగర్ మండల సమాచార హక్కు చట్టం ప్రజా చైతన్య సమితి కన్వీనర్ పంజాల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ఆర్.టి.ఐ 2005 భారతదేశంలో ప్రభుత్వ శాఖలు పబ్లిక్ అథారిటీల పనితీరును పారదర్శకతను జవాబుదారీతనాన్ని పెంచడానికి రూపొందించబడిన చట్టం సమాచార హక్కు చట్టం అనేది భారత ప్రజాస్వామ్య చరిత్రలో ప్రజలకు లభించిన అత్యంత విలువైన కానుక గోప్యత సంస్కృతికి స్వస్తికి పలికి ప్రజల సొమ్ము కు ప్రతి పైసా లెక్క చెప్పే బాధ్యతను ప్రభుత్వాలకు గుర్తు చేసిన శక్తివంతమైన సాధనమిది అవినీతి రహిత సమర్థవంతమైన పరిపాలన సాధ్యం కావాలంటే ప్రతి పౌరుడు ఈ చట్టంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి అక్టోబర్ 12న జరుపుకునే సమాచార హక్కు చట్టం అమలు దినోత్సవం సంద ర్భంగా ఈ చట్టాన్ని బాధ్యతాయుతముగా వినియోగిస్తూ ప్రజాస్వ మ్యాన్ని పరిరక్షిస్తామని ప్రతిన భూను దాము పారదర్శక పరిపాలనే ప్రజాస్వామ్యానికి



ప్రాణవాయువు దేశ ప్రజలందరికీ సమాచార హక్కు చట్టం అమలు దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.




## సోషల్ మీడియా కన్వీనర్‌గా షేక్ హాజీ

**బొమ్మలరామారం, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):**



యాదాద్రి భువనగిరి జిల్లా పీఆర్టీయూ టీఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా బొమ్మలరామారం మండలం యావపూర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు షేక్ హాజీ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పీఆర్టీయూ టీఎస్ జిల్లా నాయకులు ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు. యావపూర్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న హాజీ ఇప్పటికే సంఘంలో జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు చేపడుతున్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు మీడియా ద్వారా వెలుగులోకి తీసుకురావడంతోపాటు సంఘం కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన సంఘం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించింది. మూసివేసిన పాఠశాలను తిరిగి తెరిపించడంలో కీలక పాత్ర దాదాపు 25 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న షేక్ హాజీ.. యావపూర్ తండాలో మూతపడిన పాఠశాలలో విద్యార్థుల చేరికలను పెంచి, తిరిగి ప్రారంభమయ్యేలా చేయడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఉపాధ్యాయ వృత్తితోపాటు సంఘ కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు. హాజీ నియామకంపై పీఆర్టీయూ టీఎస్ జిల్లా, మండల నాయకులతోపాటు పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఈ సందర్భంగా షేక్ హాజీ తెలిపారు.

## యాత్రలో మోత్కూరు వాకర్స్ మిత్ర బృందం



**మోత్కూరు, అక్టోబర్ 12 ( వార్తావేదిక సూర్య ):**

ఎల్ ని ఓ ప్రభావం వలన ఏర్పడిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పకృతి_ పచ్చదనం_ అడవులు_వాతావరణం_ జీవన వైవిధ్యం దృష్టిలో ఉంచుకొని అటవీ ప్రాంతాలైన ఖమ్మం జిల్లా మారేడుపల్లి, ఏపీలోని రంపచోడవరం ప్రదేశాలను మోత్కూరు వాకర్స్ మిత్ర బృందం సభ్యులు సోమవారం సందర్శించారు. గత 15 సంవత్సరాలుగా ఆరోగ్యమే ప్రథమ లక్ష్యంగా ప్రతిరోజు క్రమం తప్పకుండా ఉదయం 5 గంటల నుండి ఏడు గంటల వరకు మార్నింగ్ వాకర్స్ బృందం సభ్యులు స్థానిక చెరువు కట్ట నుండి జామ చెట్ల బావి ఎక్స్ రోడ్ వరకు కాలినడకన నడుస్తుంటారు. వాకర్స్ బృందం స్థానిక శ్రీరామలింగేశ్వర స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలలో అన్నదాన కార్యక్రమాలకు భాగస్వామ్యం అవుతుంటారు. ఈ ప్రాంతాలను తాము సందర్శించే క్రమంలో అటవీక ప్రజల జీవన విధానం సంస్కృతి_ సాంప్రదాయాలు ఎలాంటి కల్తి లేని ఆహారపు ఉత్పత్తులు నాగరిక ప్రపంచ నుంచి ప్రకృతి ఒడిలోకి తిరోగమనం చేయాలని అనిపించేలా ఉన్నాయని వాకర్స్ బృందం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ బృందం సభ్యులు జంపాల రాజు,పైళ్ల సోమిరెడ్డి, బయ్యని రాజు, సజ్జనం పాండు, దబ్బేటి సోంబాబు,నిలిగొండ కృష్ణ, తాటిపాముల జలేంద్ర చారి, కారు పోతుల శ్రీనివాస్, మాండ్రా రమేష్, మెంట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ పాల్గొన్న అధికారులు



**మోత్కూరు, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):**

ఎల్ ని ఓ ప్రభావంగా రాష్ట ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో బాగంగా మండలంలోని అనాజీపురం రైతు వేదిక కార్యాలయంలో నిర్వహించారు. ఎల్ ని ఓ. ప్రభావం వల్ల వాతావరణం లో చోటు చేసుకునే మార్పులు రబీ సీజన్ పై వాటి ప్రభావం ప్రస్తుత వాతావరణం, పరిస్థితుల అనుగుణంగా అనుసరించాల్సిన పంటల సాగు విధానం, పంటల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తగిన పంటలను ఎంపిక చేసుకోవాలని ఏ విషయ శాఖ సూచనలు పాటిస్తూ సాగు ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పథకాలు సూచనలు అమలవుతున్న తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.

## ప్రశంసా పత్రం అందుకున్న ఎస్సై శ్రీకాంత్ రెడ్డి

**వలిగొండ: అక్టోబర్ 12 ( వార్తా వేదిక సూర్య):**

గత నెల 21, 29 తేదీలలో వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన డీజిల్ దొంగతనం కేసులను చాకచక్యంగా ఛేదించినందుకు వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అభినందించారు.ఈ కేసులో నిందితుడిని తెలివిగా, అతి తక్కువ సమయంలోనే పట్టుకుని దర్యాప్తును పూర్తి చేసినందుకు గాను ఆకాంక్ష్ యాదవ్ చేతుల మీదుగా ఆయనకు ప్రశంసా పత్రం అందజేశారు. పోలీసు శాఖలో ఇలాంటి చురుకైన అధికారులు ఉండటం వల్ల ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

https://epaper.vaarthavedikasurya.com
PRGI NO: TGTEL/25/A0305
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY





# నల్లగొండ

## విజయదశమి ఏర్పాట్లను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి : కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్



భువనగిరి టౌన్ అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

భువనగిరి పురపాలక లో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా బ్రహ్మంగారి దేవాలయం, నల్గొండ రోడ్, రాంనగర్, 22వ వార్డు, భువనగిరి నందు దసరా పండుగను ఘనంగా నిర్వహించనున్నామని మునిసిపల్ చైర్ పర్సన్ మరియు కమిషనర్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. బ్రహ్మంగారి ఆలయంలో దసరా రోజున జమ్మి ఆకు తీసుకోవడానికి పట్టణ ప్రజలందరూ విచ్చేయడం ఆనవాయితీగా వస్తోంది. వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ప్రజల భద్రత మరియు సౌకర్యార్థం ప్రతి సంవత్సరం మున్సిపాలిటీ తరపున చేయబడే ఏర్పాట్లను ఈ సంవత్సరం కూడా చేయవలసిందిగా కోరుచున్నాను. ప్రత్యేక పారిశుధ్యం: ఆలయ పరిసర ప్రాంతాలు మరియు దారి మొత్తం ప్రత్యేక పారిశుధ్య పనులు, లైటింగ్ అలాగే ప్రజల రక్షణ కొరకు మరియు రద్దీని నియంత్రించుటకు బారికేడింగ్ ఏర్పాటు, త్రాగునీటి సౌకర్యం మరియు బ్లీచింగ్ ఇతర ఏర్పాట్లను.కల్పించాలంటూ కమిషనర్ కు మున్సిపల్ చైర్మన్ కు కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కల సాకారం

### ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



గట్టుప్పల్అ ,అక్టోబర్12(వార్త వేధిక సూర్య):

గట్టుప్పల్ మండలం లోని కమ్మగూడెం గ్రామంలో మెరుగు శ్రీలత సతీష్ ల నూతన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం వారి చిన్నారులను మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.పేదల సొంత ఇంటి కలను సాకారం చేయాలనే దృఢ సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు.అర్హులైన పేదలకు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను అందజేసి పేదింటి కలను సాకారం చేస్తుందన్నారు.సర్పంచ్ మెరుగు సలమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విరమల్ల శ్రీశేలం, కాంగ్రెస్ నాయకులు కంచుకట్ల సంపత్,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

### చిట్యాల పోలీస్‌స్టేషన్ తనిఖీలో యాదాద్రి జోన్ ఐజీ షాహనవాజ్ ఖాసిం ఆదేశం



నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య )

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతోపాటు నేరాల నియంత్రణపై నిరంతరం నిఘా ఉంచాలని యాదాద్రి జోన్ ఐజీ షాహనవాజ్ ఖాసిం పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డులు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆయన వెంట ఉన్నారు. జాతీయ రహదారితోపాటు ఇతర రహదారులపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఐజీ సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. హెల్మెట్, సీటుబెల్టు వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, బాలలపై లైంగిక నేరాల కేసుల్లో చట్టప్రకారం వేగంగా స్పందించి, బాధితుల గోప్యతను కాపాడుతూ నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. దొంగతనాలు, వాహనాల చోరీల నియంత్రణకు రాత్రి గస్తీ పెంచాలని, సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు.పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, రౌడీషీటర్లు, పునరావృత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని తెలిపారు. సైబర్ మోసాల బారినపడిన బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలకు చట్టప్రకారం సత్వర పరిష్కారం చూపాలని సూచించారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రతకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచుతామని తెలిపారు. తనిఖీలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, చిట్యాల సీఐ సురేశ్, ఎస్ఐ వెంకట్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కరువు మండలంగా ప్రకటించాలి ప్రజావాణిలో వినతి

### సిపిఐ(ఎం) నాంపల్లి మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి



నాంపల్లి అక్టోబర్ 12(వార్త వేదిక సూర్య)

నల్లగొండ జిల్లా నాంపల్లి ని కరువు మండలంగా ప్రకటించాలి ఈరోజు నాంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది సిపిఐ(ఎం) నాంపల్లి మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి ఈ సందర్భంగా మాట్లాడుతూ కరువు మండలం గా ప్రకటించడంతోపాటు, పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవైపు వర్షాభావం లేక సరైన సమయంలో వర్షాలు పడకపోవడంతో ఎంతోమంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని ఆయన అధికారులను కోరారు. ఎల్ నీనో పరిస్థితిలు వాతావరణం మార్పుల నేపథ్యంలో కేంద్రం మద్దతు ధర ప్రకటించిన పంటలన్నీటికి 100% మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి కోరారు.ఒకవైపు ఎల్‌నినో ప్రభావం, మరోవైపు విద్యుత్ కొరత రోజుకు 7:00 నుండి 9 గంటల మాత్రమే కరెంటు ఇస్తున్న కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించి నీటిని ఆదా చేసి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లను నింపి ఉంటే ప్రస్తుతం రైతులకు ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి వచ్చేది కాదన్నారు. వ్యవసాయానికి అవసరమైన మేరకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటంతో రైతుల మోటర్లు కాలిపోతున్నాయని మరియు మోటార్లు పనిచేయక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. క్రాప్ హాలిడే ప్రకటించడం పరిష్కారం కాదని, పంటల సాగుకు అవసరమైన నీరు, విద్యుత్ అందించి వ్యవసాయాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ తెలంగాణలో రైతులు పంటలు సాగు చేయకుండా క్రాప్ హాలిడే ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడటం ప్రభుత్వ ముందస్తు ప్రణాళిక లోపానికి నిదర్శనం అన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే రైతులతో కలిసి మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు వాసిపాక ముత్తిలింగం, కొమ్ము లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుంది

ఆలేరు, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):



ఉమ్మడి ఖమ్మం–నల్లగొండ–వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ కచ్చితంగా కైవసం చేసుకుంటుందని మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలోని ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్ లో ఆమె ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం నల్లగొండ–వరంగల్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గొంగిడి సునిత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని విమర్శించారు. రైతు భరోసా కింద రూ.15 వేల సాయం, రూ.2 లక్షల రుణమాఫీ, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం వంటి హామీలతో కాంగ్రెస్ గ్రామీణ ప్రజలను మభ్యపెట్టిందని ఆరోపించారు. హామీలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో ప్రజలు అసంతృప్తితో ఉన్నారని అన్నారు. పార్టీ శ్రేణులు గ్రామాల్లో చురుగ్గా పనిచేస్తూ ప్రతి వంద ఓట్లకు ఒకరు కేటీఆర్‌లా బాధ్యత తీసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని ఓటరు నమోదు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కృషి చేయాలని పార్టీ నాయకులు, దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి ఖమ్మం నల్లగొండ వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మె ల్సీ స్థానంలో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

# కాటన్ మిల్లును ప్రారంభం

### ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



చండూరు, అక్టోబర్ 12(వార్త వేదిక సూర్య):

చండూరు మండలం తస్కానిగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వరమహాలక్ష్మి కాటన్ మిల్లును మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. మిల్లు ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్పత్తి కార్యకలాపాలను లాంఛనంగా ప్రారంభించారు.నియోజకవర్గంలో పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఇలాంటి పరిశ్రమలు ఏర్పాటవడం ద్వారా రైతులకు వారి పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర లభించడంతో పాటు, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మునుగోడును అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు.మిల్లు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డికి స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు మిల్లు యాజమాన్యం ఘన స్వాగతం, శాలువాలతో సత్కరించారు. చండూరు మున్సిపల్ చైర్మన్ డా.కోడి శ్రీనివాసులు,వైస్ చైర్మన్ భూతరాజు దశరథ ,గ్రామ సర్పంచ్ కొండ రజిత రవి, మండల అధ్యక్షుడు మేకల సాగర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఐతరాజు మల్లేష్,కోడి వెంకన్న, మాజీ ఎంపీటీసీ పల్లె వెంకన్న ,మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు,మాజీ సర్పంచ్ లింగయ్య యాదవ్,మిల్లు యజమానులు, పెద్ద సంఖ్యలో రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ప్రతిభ

### 120 మంది పోలీసులకు ఎస్పీ ప్రశంసా పత్రాలు
### నేరాల ఛేదన, సైబర్ నేరాల నియంత్రణ, కోర్టుల్లో శిక్షలు పడేలా కృషి చేసిన సిబ్బందికి అభినందనలు




యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య): విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి, నేరాల ఛేదన, కేసుల దర్యాప్తు, న్యాయస్థానాల్లో నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో విశేష సేవలు అందించిన 120 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ప్రశంసా పత్రాలు అందజేశారు. తుర్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో, అత్యాచార కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా వాదనలు వినిపించిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రవీందర్ రెడ్డి సేవలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా బొమ్మలరామారం పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన హత్య కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసుల కృషిని ప్రశంసించారు. గుండాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుడికి శిక్ష పడేలా న్యాయపరంగా కృషి చేసిన నల్గొండ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నర్సింహను అభినందించారు. గణేష్ నిమజ్జనోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించిన అధికారులు, సిబ్బందితో పాటు సైబర్ నేరాలను ఛేదించి బాధితులకు న్యాయం అందించేందుకు కృషి చేసిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత, వృత్తి నైపుణ్యంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అభినందనలకు అర్హులని పేర్కొన్నారు. నేరస్తులకు శిక్షలు పడేలా సమర్థవంతమైన దర్యాప్తు, పటిష్టమైన న్యాయవాదన కీలకమని తెలిపారు. ప్రజల భద్రత కోసం అంకితభావంతో పనిచేసే సిబ్బంది సేవలను గుర్తించి ప్రోత్సహించడం పోలీస్ శాఖ బాధ్యతని అన్నారు. స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

# గ్రీవెన్స్ డేలో 38 మంది నుంచి ఫిర్యాదుల స్వీకరణ

### బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు: ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య )

నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ 38 మంది బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడారు.ప్రతి ఫిర్యాదుపై క్షుణ్ణంగా పరిశీలన జరిపి, చట్టపరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా, నిర్ణీత సమయంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకోవడమే పోలీస్ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు.

### ఆసియా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో

# నల్లగొండ వాసి

నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య)

బెంగళూరులో అక్టోబర్ 4 నుంచి 10 వ తేదీ వరకు నిర్వహించిన ఆసియా మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్–2026 లో నల్లగొండ జిల్లా పోలీస్ శాఖకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ బి. పురుషోత్తం రావు భారతదేశం తరపున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో తన ప్రతిభను ప్రదర్శించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ ను పురుషోత్తం రావు మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించినందుకు ఎస్పీ ఆయనను అభినందించారు. విధి నిర్వహణతో పాటు క్రీడలపై ఆసక్తిని కొనసాగించడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు.



https://epaper.vaarthavedikasurya.com
PRGI NO: TGTEL/25/A0305
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



# హైదరాబాద్–విజయవాడ రహదారి విస్తరణకు వేగం!

**ఎన్‌హెచ్-65ను ఆరు లేన్లుగా అభివృద్ధి చేయాలి**
**నవంబర్ 11 వరకు టెండర్ల దాఖలు.. 2027 జనవరిలో పనుల ప్రారంభం**
**ఎన్‌హెచ్ఏఐ ఛైర్మన్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి**



హైదరాబాద్ , అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

హైద రాబాద్– విజ య వాడ – మ చిలీప ట్నం జాతీయ రహదారి–65 (ఎన్‌హెచ్–65) విస్తరణ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా ప్రారంభించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. న్యూఢిల్లీలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్, సభ్యుడు (ప్రాజెక్టులు) విప్నేష్ శర్మతో సమావేశమైన మంత్రి.. ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు.

### ప్రమాదాల నివారణకు ఆరు లేన్లు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కీలకమైన ఈ రహదారిపై వాహనాల రద్దీ పెరుగుతోందని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా చేపట్టాలని కోరారు. ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్ల రహదారిని ఆరు లేన్లుగా విస్తరించడంతోపాటు, ఇరువైపులా రెండు సర్వీస్ రోడ్లు, నియంత్రిత ప్రవేశ సౌకర్యాలు అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఈ పనులు పూర్తయితే ట్రాఫిక్ రద్దీ తగ్గడంతోపాటు ప్రయాణ సమయం ఆదా అవుతుందని, రహదారి భద్రత మెరుగుపడుతుందని మంత్రి వివరించారు.

### 2027 జనవరిలో పనులు ప్రారంభం

మంత్రి విజ్ఞప్తిపై స్పందించిన ఎన్‌హెచ్ఏఐ ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్.. ప్రాజెక్టుకు సంబంధించి టెండర్ల దాఖలుకు 2026 నవంబర్ 11 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. 2027 జనవరి నాటికి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

### ప్రజల ప్రాణాల భద్రతే ప్రాధాన్యం

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి వేలాది మంది ప్రయాణికులకు నిత్యం కీలక రవాణా మార్గమని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రమాదాలను తగ్గించి, సురక్షితమైన ప్రయాణాన్ని అందించడంతోపాటు, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమిచ్చేలా విస్తరణ పనులను ప్రాధాన్యంతో చేపట్టాలని కోరారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తయ్యేలా కేంద్ర సంస్థలతో నిరంతరం సమన్వయం చేసుకుంటామని మంత్రి తెలిపారు.

# ఉసిరి రసం తాగితే ఇన్ని లాభాలా..!



ఇంటర్ నెట్ డెస్క్ వార్త వేదిక సూర్య:

సైజులో చిన్నగా ఉన్నా ఉసిరి అందించే ప్రయోజనాలు చాలా ఉన్నాయి. దీనిలో విటమిన్ సీ, యాంటీఆక్సిడెంట్లు, ఐరన్, కాల్షియం వంటి పోషకాలుంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఎంతో సహాయపడతాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా 'మన్ కీ బాత్' 138వ ఎపిసోడ్‌లో ఉసిరికాయ ప్రయోజనాలను వివరించారు. అందుకే ఈ మధ్యన ఉసిరి రసాన్ని చాలామంది ఇష్టంగా సేవిస్తున్నారు. ఇలా తాగడం వల్ల ప్రయోజనాలేంటో తెలుసుకుందాం. రోగనిరోధక శక్తి: ఉసిరికాయలో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక వ్యవస్థను బలపరుస్తుంది. జలుబు, దగ్గు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ ఇస్తుంది.

### జీర్ణ వ్యవస్థ:

ఉసిరి రసం జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, ఎసిడిటీ లాంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

### జుట్టు ఒత్తుగా, చర్మం ఆరోగ్యంగా:

ఉసిరిలోని యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు జుట్టును బలంగా, ఒత్తుగా పెరిగేలా చేస్తాయి. ఇవి జుట్టు రాలడాన్ని పూర్తిగా నివారిస్తాయి. అంతేకాకుండా ఈ యాంటీఆక్సిడెంట్లు చర్మంపై ముడతలను తగ్గిస్తాయి. బరువు తగ్గిస్తుంది: బరువు తగ్గాలనుకుంటే ఉసిరి ఒక మంచి ఎంపిక. ఇది శరీరం నుంచి విషపదార్థాలను బయటకు పంపడం ద్వారా బరువు తగ్గే ప్రక్రియను సులభతరం చేస్తుంది.

### కళ్లకూ మంచిది:

ఉసిరి రసం కళ్లకూ మేలు చేస్తుంది. దీనిలో ఉండే కెరోటిన్ దృష్టిని మెరుగుపరుస్తుంది. శుక్లాలు, కంటి ఒత్తిడి వంటి సమస్యలను తగ్గిస్తుంది.

### ఉసిరి రసం చేసే విధానం:

ముందుగా ఉసిరికాయలను బాగా కడిగి చిన్న ముక్కలుగా కట్ చేయండి. వాటిని మిక్సర్‌లో వేసి, తగినంత నీళ్లు పోసి గ్రైండ్ చేయండి. అంతే ఉసిరి రసం రెడీ. ఆ తరువాత దాన్ని వడగట్టి తాగండి. ఈ రసాన్ని 15 రోజుల పాటు పరగడుపున సేవిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

# బతుకమ్మ వేడుకల్లో కుల దూషణ

**బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి**
**ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ, ఆలేరు నియోజకవర్గ ఇంచార్జి నల్ల చంద్రస్వామి మాదిగ డిమాండ్**



ఆలేరు, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల సందర్భంగా కులం పేరుతో దూషించి, దళిత మహిళలను అవమానపరిచిన వారిపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ, ఆలేరు నియోజకవర్గ ఇంచార్జి నల్ల చంద్రస్వామి మాదిగ డిమాండ్ చేశారు. ఘటనపై ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు సోమవారం అమ్మనబోలు గ్రామాన్ని సందర్శించి బాధిత దళిత మహిళలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ సమీపంలో జరిగిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో మాదిగ మహిళలను కులం పేరుతో దూషిస్తూ, తాము బతుకమ్మ ఆడే ప్రదేశంలో వారు ఆడకూడదని అవమానపరిచినట్లు బాధిత మహిళలు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. విషయంపై సంబంధిత పోలీస్ ఎస్ఐ, తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడిన నాయకులు, ఘటనపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని పోలీసు అధికారులను కోరారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో కుల వివక్షకు చోటు ఉండకూడదని, బాధిత మహిళలకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ, ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ ఆలేరు నియోజకవర్గ ఇంచార్జి నల్ల చంద్రస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర నాయకుడు ఇటికాల దేవేందర్ మాదిగ, ఆలేరు మండల అధ్యక్షుడు కందుల నర్సింగరావు మాదిగ, మోటకొండూరు మండల ఇంచార్జి ఆడెపు శ్రీనివాస్ మాదిగ, మండల అధ్యక్షుడు కొంపల్లి పరశురాములు మాదిగ, సీనియర్ నాయకులు గోసంగి పరమేష్ మాదిగ, బిక్షపతి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

**- త్వరితగతిన కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి**
**- ఎస్పీ అక్షాన్ష్ యాదవ్**



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య):

యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. భువనగిరిలోని డీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన నెలవారీ క్రైమ్ రివ్యూ సమావేశంలో ఆయన కేసుల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్ఓలు, ఎస్ఐలు, టెక్నికల్ టీమ్, సీసీఎస్, సైబర్ క్రైమ్, డీసీఆర్బీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ల వారీగా నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా పోక్సో, వరకట్న వేధింపులు, హత్య వంటి తీవ్రమైన కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో తీసుకొని, సమర్థవంతమైన దర్యాప్తుతో వీలైనంత త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. కేసుల ఛేదనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని, సాక్ష్యాధారాల సేకరణలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో పెండింగ్ కేసుల పురోగతిని డీఎస్పీలు నిరంతరం పర్యవేక్షిస్తూ, సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, దర్యాప్తు నాణ్యతను పెంచి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ స్పష్టం చేశారు.



## సూర్యాపేట

# ట్రిబుల్ ఆర్ రెస్టారెంట్ & హోటల్ ప్రారంభం



చౌటుప్పల్ అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య)

వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రుచికరమైన శాకాహార మాంసాహార ఆహార పదార్థాలు అందించడానికి ట్రిబుల్ ఆర్ రెస్టారెంట్ అండ్ హోటల్ ప్రాధాన్యత ఇస్తుందని హోటల్ నిర్వాహకులు గోపి మహేష్, గోపి కిరణ్, బండిగారి రాజలింగం తెలిపారు. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం సమీపం హైదరాబాద్ వైపు రోడ్డులో భారీ ట్రిబుల్ ఆర్ రెస్టారెంట్ అండ్ హోటల్ ను సోమవారం ప్రముఖ పారిశ్రామికవేత్త రిక్కల గోపాల్ రెడ్డి తన చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ యజమానులు మాట్లాడుతూ.. దినదిన అభివృద్ధి చెందుతున్న కొయ్యలగూడెం జాతీయ రహదారిపై మంచి హోటల్ రెస్టారెంట్ స్థాపించడం జరిగిందని పేర్కొన్నారు. ఎంతో అనుభవజ్ఞులైన వంట మాస్టర్ , స్టార్ హోటల్ ను తలపించేలా డైనింగ్ హాల్స్, విశాలమైన పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుటుంబ సమేతంగా భోజనం చేసే విధంగా విశాలమైన హాళ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్టార్ హోటల్ మాదిరిగా ఉన్న ట్రిబుల్ ఆర్ లో సాధారణ హోటల్ ధరల్లోనే టిఫిన్స్, భోజనాలు అన్ని రకాల ఆహార పదార్థాలు అందిస్తామని తెలిపారు. నూతన హోటల్ యజమాన్యంను పలువురు అభినందించారు. వివిధ గ్రామాలసర్పంచులు నాయకులుప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# అంబులెన్స్ సేవలపై జాతీయ బృందం తనిఖీలు

నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య )

నల్గొండ జిల్లాలో 108 అత్యవసర అంబులెన్స్ సేవల నాణ్యతను ఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది.అంబులెన్స్‌లలో ప్రాణరక్షక మందులు, ఆక్సిజన్, వెంటిలేటర్, డీఫిబ్రిలేటర్ వంటి పరికరాల లభ్యతతో పాటు అత్యవసర కేసులను నిర్వహించడంలో సిబ్బంది సామర్థ్యం, స్పందన సమయం, పరిశుభ్రత, వైద్య వ్యర్థాల నిర్వహణ, రికార్డుల నిర్వహణను తనిఖీ చేసింది.జిల్లాలో 108 అంబులెన్స్‌లు 24 గంటలూ ఉచిత అత్యవసర సేవలు అందిస్తున్నాయని, సగటు స్పందన సమయం 20 నిమిషాల్లోపు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ తెలిపారు. అంబులెన్స్‌ల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణలో మరింత మెరుగుదలకు పలు సూచనలు చేసినట్లు వెల్లడించారు. జిల్లా అధికారులు, నాణ్యతా నిర్వహణ అధికారి, 108 క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రథమ చికిత్స

**ఆరోగ్య పరిరక్షణపై అవగాహన**




నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య)

తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో గంధంవారిగూడెంలో నిర్వహిస్తున్న 12 వ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా మూడో రోజు క్యాడెట్లకు ప్రథమ చికిత్స, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరఫున డాక్టర్ సృజన రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని, ప్రమాదాలు జరిగినప్పుడు అందించాల్సిన ప్రాథమిక వైద్య సహాయం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ అంశాలను వివరించారు. సకాలంలో సరైన ప్రథమ చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ జేమ్స్ శామ్యూల్, అసిస్టెంట్ క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ శశిధర్ రావు పర్యవేక్షణలో శిబిరం కొనసాగుతోంది.ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ మాధవరావు, కెప్టెన్ విక్రం బాబు, లెఫ్టినెంట్ చిలుముల సుధాకర్, సుబేదార్ కొమ్ము మల్లయ్య, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు, పీఐ సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు క్యాడెట్లలో ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయని నిర్వాహకులు తెలిపారు.

# క్లాక్‌టవర్ జంక్షన్‌కు కొత్త రూపు

**స్కైవాక్, అర్బన్ ప్లాజా ప్రతిపాదనలు**
**వరల్డ్ బ్యాంక్ బృందంతో అభివృద్ధి పనులపై మేయర్ క్షేత్రస్థాయి పరిశీలన**

నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య):

నల్గొండ నగరంలోని క్లాక్‌టవర్ జంక్షన్ అభివృద్ధి ప్రాజెక్టుపై మున్సిపల్ అధికారులు, వరల్డ్ బ్యాంక్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీతో కలిసి ప్రతిపాదిత అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా స్కైవాక్, వాణిజ్య సముదాయం, అర్బన్ ప్లాజా, రీచార్జ్ వెల్స్ నిర్మాణ ప్రతిపాదనలపై చర్చించారు. పర్యావరణ పరిరక్షణ, భూసంబంధిత అంశాలు, ప్రజల అభిప్రాయాల సేకరణ, నిర్మాణ సమయంలో భద్రతా చర్యలు, ఫిర్యాదుల పరిష్కారంపై వరల్డ్ బ్యాంక్ బృందం పలు సూచనలు చేసింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. వంశీకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్‌పర్సన్ అబ్బగోని రమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. మనోహర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి. అశోక్ కుమార్, అసిస్టెంట్ ఇంజినీర్ వి. దిలీప్ భర్గవ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.





# మహబూబ్‌నగర్

# పోలీసు సేవలు, అమరవీరుల త్యాగాలపై సృజనాత్మక చిత్రాలకు ఆహ్వానం

**- పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా లఘుచిత్రం, ఫోటోగ్రఫీ పోటీలు..**

**- ఎస్పీ డి. జానకి..**

**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య):**

పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడు నిమిషాల లఘుచిత్రం, ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తెలిపారు. పోలీసుల సేవలు, అమరవీరుల త్యాగాలు, ప్రజా భద్రత కోసం పోలీసులు చేస్తున్న కృషిని ప్రతిబింబించేలా చిత్రాలను రూపొందించాలని సూచించారు.పోలీసుల విధులు, ప్రజల తో స్నేహపూర్వక సంబంధాలు, మహిళలు--పిల్లల భద్రత, ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రత, నేర నియంత్రణ, సామాజిక అవగాహన వంటి అంశాలపై లఘుచిత్రాలు, ఛాయాచిత్రాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. లఘుచిత్రం గరిష్ఠంగా మూడు నిమిషాల నిడివి ఉండాలని, ఫోటోగ్రఫీ పోటీకి ఇటీవల తీసిన ఉత్తమ చిత్రాలను పంపించాలని తెలిపారు.

**ఈ నెల 23లోగా సమర్పించాలి..**

పోటీల్లో పాల్గొనేవారు తమ లఘుచిత్రాలు, ఫోటోలను అక్టోబర్ 23, 2026లోగా జిల్లా ఎస్పీ కార్యాలయంలోని ఐటీ సెల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రవికి అందజేయాలి. వివరాలకు 8712658298 నంబర్‌ను సంప్రదించవచ్చు.జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు లఘుచిత్రాలు, మూడు ఛాయాచిత్రాలను ఎంపిక చేసి విజేతలకు ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. ఎంపికైన మొదటి మూడు స్థానాల చిత్రాలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నారు. రాష్ట్రస్థాయిలో విజేతలకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా బహుమతులు, ప్రతిభా పత్రాలు అందజేయనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. పోలీసు సేవలు, అమరవీరుల త్యాగాలను ప్రజలకు చేరువ చేసే ఈ పోటీల్లో ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, సృజనాత్మక ప్రతిభ కలిగిన వారు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జానకి కోరారు.




# రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ

**- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని విత్తనాలు అందజేసిన మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 12(వార్తా వేదిక సూర్య) :**

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎదిర రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు. అనంతరం రైతులతో మాట్లాడి వారికి నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు కార్పొరేటర్ పెద్దగుల్ల నరసింహులు, నాలుగో వార్డు కార్పొరేటర్ అనుప ఆంజనేయులు, వ్యవసాయ శాఖ అధికారులు, వార్డు సభ్యులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.





# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి

**స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్**




**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 12 ( వార్తా వేదిక సూర్య):**

చౌడాపూర్ మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రాంమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు శివరాం నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు రాజేందర్ రెడ్డి, సలీమ్, వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి రాము, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాల్, వార్డు సభ్యులు నర్సింలు, యాదయ్య, శ్రీను, మణికంఠ, మల్లేష్, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ పూల బతుకమ్మలపై బాలరాజ్ మాదిగ ఆగ్రహం

**- సహజ పూలతో బతుకమ్మలు ఏర్పాటు చేయాలి..**

**ప్లాస్టిక్ అలంకరణలు తొలగించాలి..**

**- మున్సిపల్ అధికారుల తీరుపై విమర్శలు.. ఆందోళనకు సిద్ధమంటూ హెచ్చరిక..**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 12( వార్తా వేదిక సూర్య):**




తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్లాస్టిక్ పూలతో అలంకరించి నగరంలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేయడంపై టీ.ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిరసినోళ్ల బాలరాజ్ మాదిగ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు ప్లాస్టిక్ నిషేధం గురించి చెబుతూ, మరోవైపు ప్లాస్టిక్ పూలతో బతుకమ్మలను ఏర్పాటు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో బాలరాజ్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగను ప్రకృతి సిద్ధమైన పూలతో జరుపుకోవడం తెలంగాణ సంప్రదాయమని పేర్కొన్నారు. అలాంటి పండుగలో ప్లాస్టిక్ పూలను ఉపయోగించడం పర్యావరణానికి హాని కలిగించడమే కాకుండా, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వ వేదికలు, నగర కూడళ్లలో ప్లాస్టిక్ పూలతో బతుకమ్మలను ఏర్పాటు చేయడం విరుద్ధమైన చర్య అని విమర్శించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్లాస్టిక్ అలంకరణల వెనుక ప్రజాధనం దుర్వినియోగం జరిగిందనే అనుమానాలపై విచారణ జరపాలని కోరారు. నగరంలోని కూడళ్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ పూల బతుకమ్మలను తక్షణమే తొలగించి, సహజసిద్ధమైన పూలతో బతుకమ్మలను ఏర్పాటు చేయాలని బాలరాజ్ మాదిగ డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఉచిత పశు వైద్య శిబిరం గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స

**మిడ్జిల్ అక్టోబర్. 12 ( వార్తా వేదిక సూర్య):**



రాణి పేట గ్రామంలో ఆవులకు మరియు గేదెలకు ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. పశువైద్య శిబిరంలో 32 పశువులకు వైద్య సేవలు అందించారు అలాగే 18 లేగ దూడలకు నట్టల నివారణ మందులు త్రాపించడం జరిగింది కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ మండల పశువైద్యాధికారి డాక్టర్ శివరాజ్ జె.వి.ఓ సత్యం వీఎల్ఓ దామోదర్ ఓ ఎస్ సత్యం గోపాలమిత్ర జిల్లా అధ్యక్షులు బి యాదగిరి మిడ్జిల్ మండలం గోపాలమిత్రాలు నరసింహ వేణుగోపాల్ మల్లేష్ రామకృష్ణ గ్రామ పాడి రైతులు పాల్గొనడం జరిగింది పాడి రైతులకు మండల పరిషత్ వైద్యాధికారి ప్రభుత్వ పథకం ఆవుల షెడ్డు ల గురించి వివరించడం జరిగింది.

# ఢిల్లీలో నిరసనకారులపై దాడులను ఖండిస్తూ సీఐటీయూ ధర్నా

**- ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య):**

ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులు, యువకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులపై జరిగిన దాడులను ఖండిస్తూ సోమవారం సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ సీనియర్ నాయకుడు కిళ్ళే గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే.మోహన్ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో చేపట్టిన నిరసనలపై కేంద్ర ప్రభుత్వం నిర్బంధ చర్యలకు పాల్పడిందని ఆరోపించారు. నిరసనకా రులపై లాఠీచార్జీలు చేసి, పలువురిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్య హక్కులు, భావప్రకటనా స్వేచ్ఛను హరించేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. నిరసనకారులను ఢిల్లీకి చేరుకోకుండా అడ్డుకోవడం, రైళ్లను నిలిపివేయడం, పలువురిని అదుపులోకి తీసుకోవడం వంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. సీపీఎం రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిటాస్‌పై దాడి జరిగినట్లు ఆరోపిస్తూ, ప్రజాప్రతినిధులకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.ఓట్ల చోరీ ఆరోపణలపై ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని నాయకులు డిమాండ్ చేశారు.

ప్రజా స్వామ్య హక్కులను కాపాడేందుకు కార్మికులు, ప్రజాసంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపుని చ్చారు.ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకుడు కమర్ అలీ, కోశాధికారి చంద్రకాంత్, టౌన్ కన్వీనర్ రాజకుమార్‌తో పాటు హనుమంతు, మనోహర్, రవి, కేశన్న, కుమ్మరి కృష్ణయ్య, శ్రీశైలం, వెంకన్న, గోపాల్, ఆంజనేయులు, కృష్ణ, మల్లేశు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 12 ( వార్త వేదిక సూర్య ) :**



నాగర్‌కర్నూల్ జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన పథకం అమలుకు సంబంధించిన న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి మైలురాయి వేడుకల్లో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అవార్డు అందుకున్నారు. సోమవారం న్యూఢిల్లీలోని ఎన్ఎస్‌సీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పురస్కారాన్ని స్వీకరించారు.దేశంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంపొందించడం, పంటల ఉత్పాదకతను మెరుగుపరచడం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజనను అమలు చేస్తోంది. వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలను అధిగమిస్తూ రైతులకు మెరుగైన సాగు అవకాశాలు కల్పించేందుకు ఈ పథకం ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు.వ్యవసాయ ఉత్పాదకత పెంపు, సాగునీటి వనరుల సమర్థ వినియోగం, పంటల దిగుబడుల మెరుగుదల, ఆధునిక వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహం, రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాలు వ్యవసాయాభివృద్ధిలో కీలకంగా నిలుస్తున్నాయి. ఈ లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.ప్రధానమంత్రి ధన్-ధాన్య కృషి యోజన పథకం అమలులో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా న్యూఢిల్లీలో జాతీయ స్థాయి మైలురాయి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి నలుగురు సభ్యులతో కూడిన ప్రతినిధుల బృందం హాజరైంది. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో పాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యశ్వంత్ రావు, కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త ఓ శైలా, ప్రగతిశీల రైతు రాజేందర్ రెడ్డి ఈ బృందంలో పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి శంకుస్థాపన



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 12 ( వార్త వేదిక సూర్య ) :**

నాగర్‌కర్నూల్ పట్టణంలోని కొల్లాపూర్ చౌరస్తాలో విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్‌ఈ) కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ప్రభుత్వ శాఖకు నూతన భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన పరిపాలనా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాల భవనాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్సీ కె. వి నరసింహారెడ్డి, డి ఈ ఎం సుధాకర్, టెక్నికల్ డి ఈ రవికుమార్, ఏది ప్రవీణ్ కుమార్, ఏ ఈ మాన్య నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మున్సిపల్ చైర్మన్ సునీంద్ర, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 145 ॥ మంగళవారం ॥ అక్టోబర్ 13, 2026



# పెద్దపల్లి

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి, అక్టోబర్-12, (వార్త వేదిక సూర్య):**

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలనిలిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,అదనపు కలెక్టర్ బి.శ్రీరాములుతో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.రామగుండం మండలానికి చెందిన ధర్ని.మల్లేష్ మండల శివారులోని సర్వే నెంబర్ 287 గల ఏడు గుంటల భూమి పట్టా పాస్ బుక్ లో తన పేరు చేర్చాలని దరఖాస్తు చేసుకోగా తాసిల్దార్ రామగుండం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి మండలం నీరుకుల్లా గ్రామానికి చెందిన ముత్యం. మైసయ్య వృద్ధాప్యంలో తన కుమారులు తన బాగోగులు చూసుకోవడం లేదని దరఖాస్తు చేసుకోగా ఆర్డీఓ పెద్దపల్లికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకో వాలని సూచించారు.మంథని మండలం కన్నాల గ్రామానికి చెందిన పోయిలా. కృష్ణ న్యాక్ లో ప్లంబర్ శిక్షణ పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నానని, తనకు ఉద్యోగ అవకాశంకల్పించాలని దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీ కి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన మహమ్మద్. జిలాని తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐ -కానిస్టేబుల్ అభ్యర్థులు మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**పెద్దపల్లి,అక్టోబర్ -12, (వార్త వేదిక సూర్య):**

పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల కోసం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన గోదావరిఖనిలో మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.అభ్యర్థులు తమ పరీక్షల సన్నద్ధతను అంచనా వేసుకుని, పోటీ పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరిచేందుకు ఈ మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్ష ఉపయోగపడుతుందని తెలిపారు. అక్టోబర్ 22వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రోత్సాహకంగా మొదటి బహుమతిగా రూ.10,000, రెండో బహుమతిగా రూ.5,000, మూడో బహుమతిగా రూ.2,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

అదేవిధంగా, పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 100 మంది అభ్యర్థులకు ఉచిత ఫిజికల్ ట్రైనింగ్‌తో పాటు భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆసక్తి గల అభ్యర్థులు లింక్ ద్వారా ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 7780543055, 8886304040 నంబర్లలో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.



# నిస్వార్థ సేవకుడు ఆర్ఎంపీ సాయికుమార్

**- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

మంథని, అక్టోబర్ -12, (వార్త వేదిక సూర్య): ఎలాంటి స్వార్థం లేకుండా పేద ప్రజలకు సేవలు అందించిన సాయికుమార్ నిస్వార్థ సేవకుడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. ముత్తారం మండలం పారుపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు బియ్యని సాయి కుమార్ జయంతి సందర్భంగా వారి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీ వైద్యుడిగా గ్రామంలోని పేదలకు మంచి వైద్య సేవలు అందించారని ఆయన గుర్తు చేశారు. ఈ కాలంలో ఏ వృత్తిలోనైనా డబ్బునే ఆశిస్తారని, కానీ సాయికుమార్ అలా కాకుండా తనవంతు సేవలు అందించి అందరి మనసులో చోటు సంపాదించుకుని ఆదర్శంగా నిలిచాడని అన్నారు. సాయి కుమార్ సేవలు మరువలేనివని, ఆయన ఆలోచనలు ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

సాయికుమార్ చిరస్థాయిగా నిలిచిపో యేలా విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆయన లేని లోటు తీరనిదని, ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ లు ఇల్లందుల అశోక్ గౌడ్, నూనె కుమార్, పోతుపెద్ది కిషన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# మంథని ప్రకండ భజరంగ్ దళ్ నూతన కమిటీ ఎన్నిక

**మంథని, అక్టోబర్ 12, (వార్త వేదిక సూర్య):**



మంథని ప్రకండ భజరంగ్ దళ్ విశ్వ హిందూ పరిషత్ నూతన కమిటీ నీ సోమవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విశ్వ హిందూపరిషత్ కరీంనగర్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, పెద్దపల్లి జిల్లా భజరంగ్దల్ సంయోజక సంపత్ యాదవ్ పాల్గొన్నారు వీరి సమక్షం లో విశ్వ హింద్ పరిషత్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శ్రీనివాస్ గుప్తా నూతన భజరంగ్దల్ కమిటీని ప్రకటించడం జరిగింది. మంథని ప్రకండ భజరంగ్దల్ సంయోజక్ గా నరేడ్ల రాజేష్.సహా సంయోజకులుగా జెంబోజు సాయి.భోగే సందీప్.గోరక్షా ప్రాముఖ్ తోగరి రాజ్ కుమార్..సురక్షా ప్రాముఖ్.ఎడ్ల ఉమేశ్..బలోపాసన కేంద్ర.జెంగపల్లి అభిషేక్.. అకాడ ప్రముఖ .వడ్ల కొండ శ్రావణ్.. విద్యార్థి.ప్రాముఖ.దేవాంశ్ , సభ్యులుగా తాటి రాము, రాంబాబు,ఎరుకల రాజేష్,తేజ.రమేష్. ఈ కార్యక్రమం లో విశ్వ హిందూ పరిషత్ మంథని ప్రకండ అధ్యక్షులు రావుల సతీష్.ఉపాధ్యక్షులు బోట్ల ఆంజనే యులు. సత్సంగ్ ప్రాముఖ్.కొమురవెల్లి హరిష్. సహ కార్యదర్శి,గుండా శ్రీనివాస్. ఎల్లంకి హరి. మందిర్మట్ .మెడగొని రాజమౌళి, పరిషత్ సభ్యులు మాలా స్వాములు హిందూ బంధువులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, హిందూ ధర్మ పరిరక్షణ, సేవా కార్యక్రమాలు, సమాజ ఐక్యత కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పెద్దలు సూచించారు.

# వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 12**

**( వార్తా వేదిక సూర్య )**

జిల్లాలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు, పశువులకు తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడటంతో పాటు, రాబోయే రబీ సీజన్‌లో నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకా శాల నేపథ్య ంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఉప్పరిగూడ రైతు వేదికలో రైతులతో ఆయన మాట్లాడారు.వేసవి నీటి అవసరాలపై ముందస్తు చర్యలువచ్చే వేసవి వరకు గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిం చడంతో పాటు, గ్రామాల్లోని పాత తాగు నీటి పథకాలు, బోర్లు, మోటార్ల పనితీరును పరిశీలిం చాలని తెలిపారు. అవసరమైన మరమ్మ తులను ముందుగానే పూర్తి చేసి, ప్రతి గ్రామం, ఆవాసంలో తాగునీటి వనరులు అందు బాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువుల తాగునీటి అవసరాలనూ విస్మరించరాదని స్పష్టం చేశారు.

**నీటి పొదుపుతోనే సాగు**

జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా బోరుబావులపై ఆధారపడి ఉన్నందున భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించి, తక్కువ నీటితో అధిక ప్రయోజనం పొందే సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

రబీ సీజన్‌లో పంటల ఎంపిక విషయంలో రైతులు తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. బోర్లలో నీటి మట్టాలు, అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను అంచనా వేసుకున్న తర్వాతే పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ, స్వల్పకాలిక పంటలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

**ఉపాధి పనులతో రైతులకు అండ**

వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు సాగు చేయలేని ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేలా గ్రామీణ ఉపాధి పనులను విస్తృతం చేయాలని కలెక్టర్ సూచించారు. వీబీ-జీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే పనులను గుర్తించి చేపట్టాలని అధికారులకు తెలిపా రు. హైదరాబాద్ మార్కెట్ అవకాశాలను వినియోగించుకునేలా ఆకుకూరలు, ఇతర స్వల్పకాలిక పంటల సాగును ప్రోత్సహించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. వర్షాభావం వల్ల రైతులకు కలిగే నష్టాలను తగ్గించేందుకు వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుజాత, డీపీఓ సురేష్ మోహన్, డీఆర్డీఏ పీడీ శ్రీలత, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మిషన్ భగీరథ అధికారి రాజేశ్వర్ రావు, ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.





# పంగ సంతోష్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శ



**మంథని, అక్టోబర్ -12, (వార్త వేదిక సూర్య):**

మంథని మండలం అడవిసోమన్ పల్లి గ్రామంలో మాజీ వార్డు సభ్యుడు, భీఆర్ఎస్ పార్టీ యువనాయకుడు పంగ సంతోష్ ఇటివల మరణించగ వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.

# అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కేసు నమోదు

**మంథని ఎస్ఐ సందీప్ కుమార్**

**మంథని, అక్టోబర్ -12, (వార్త వేదిక సూర్య)**

మంథని పోలీసు సిబ్బంది రచ్చపల్లి గ్రామ శివారులో సోమవారం ఉదయం 7 గంటల సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఒక వ్యవసాయ భూమి నుండి ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని జెసిబి సహాయంతో తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నట్లు గుర్తించారు. అక్కడ ఒక జెసిబి సహాయంతో మట్టిని తవ్వి ఏడు ట్రాక్టర్లలో నింపి అక్రమంగా తరలిస్తున్నట్లు తనిఖీలో తేలింది. జెసిబి డ్రైవర్-కమ్-ఓనర్, ఏడు ట్రాక్టర్ల ఓనర్లు, డ్రైవర్లు సహా మొత్తం 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా మట్టిని తవ్వి ట్రాక్టర్ ట్రిప్‌కి రూ.400 చొప్పున అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు.పంచల సమక్షంలో పంచనామా నిర్వహించి జెసిబి తో సహా మట్టితో నిండిన ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి నిందితులను మంథని పోలీస్ స్టేషన్‌కు తరలించి, ఫిర్యాదు ఆధారంగా మంథని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లుగా మంథని ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి



**నాగర్ కర్నూల్ అక్టోబర్ 12 ( వార్త వేదిక సూర్య ) :**

నాగర్ కర్నూల్ జిల్లాలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులకు వినతి పత్రం అందజేసి పరిష్కరించాలని కోరారు. ఈ ప్రజావాణిలో 46 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని సంబంధిత జిల్లా అధికారులకు అందించి సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పాండు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ , వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రామీణ వైద్యుల అలయ్ బలాయ్

**మూడు మండలాల ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం...**



**యాచారం, అక్టోబర్ 12 (వార్తా వేదిక సూర్య):** దసరా పండుగ సందర్భంగా యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామంలో గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం అలయ్ బలాయ్ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉక్కుల అశోక్ మాట్లాడుతూ, పద్మావతి ఆసుపత్రి నూతన యాజమాన్యం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు. రోగులకు మంచి వైద్యం అందించి వారి మరణాలు పొందాలన్నారు. యాచారం, మాడుగుల, చింతపల్లి మండలాలకు చెందిన ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం వైద్యులు ఒకరికొకరు అలయ్ బలాయ్ చేసుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర్ రెడ్డి, కళ్యాణ్ కుమార్, సందీప్ రెడ్డి తదితరులతో పాటు మూడు మండలాల వైద్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## రంగారెడ్డి



## గుంతల్లో నిలుస్తున్న నీరు.. పెరుగుతున్న దోమలు..

### రోడ్ల మరమ్మతులు చేపట్టాలని అసోసియేషన్ అధ్యక్షుడు అడికే మహేందర్ విజ్ఞప్తి.

రాజేంద్రనగర్, అక్టోంబర్ 12 ( వార్త వేదిక సూర్య ) :



మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ మల్లికార్జున నగర్‌లో అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని శ్రీ మల్లికార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడికే మహేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను గతంలోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. గుంతల కారణంగా బస్తీ ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మల్లికార్జున నగర్‌లోని అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని మహేందర్ కోరారు. ప్రజల ఆరోగ్యం, ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్యను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## కోర్టు ఆదేశాలతో ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు

### లక్ష్మిగూడ ప్రభుత్వ భూములపై పూర్తిస్థాయి సర్వే చేపట్టాలి: వనంపల్లి జైపాల్ రెడ్డి

రాజేంద్రనగర్, అక్టోంబర్ 12 ( వార్త వేదిక సూర్య ) :




రాజేంద్రనగర్ మండలం లక్ష్మిగూడ సర్వే నంబర్ 156/2లోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి కోర్టు ఆదేశాల నేపథ్యంలో హైడ్రా, రెవెన్యూ శాఖ అధికారులు పోలీసు బందోబస్తుతో చర్యలు చేపట్టారని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనంపల్లి జైపాల్ రెడ్డి తెలిపారు.

గతంలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని లేఅవుట్‌గా మార్చి ఫ్రెండ్స్ కాలనీ పేరుతో ప్రజలకు విక్రయించారని ఆరోపించారు. లక్ష్మిగూడ, మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు. సర్వే నంబర్ 156 పరిధిలో సుమారు 400 ఎకరాల భూమి ఉందని, బై నంబర్ల పేరుతో కొంత భూమి ఆక్రమణలకు గురైందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో భూ సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించాలని కోరారు. ప్రభుత్వ భూములతో పాటు పార్కులను కూడా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. 2007లో ఇదే సర్వే నంబర్ పరిధిలో పేదలకు 60 గజాల ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఐ ఆధ్వర్యంలో భూపోరాటం నిర్వహించగా, ప్రభుత్వ భూమి పేరుతో గుడిసెలు తొలగించి కమ్యూనిస్టు నాయకులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపారని గుర్తుచేశారు. అదే ప్రాంతంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి విక్రయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పేద, మధ్యతరగతి ప్రజలు భూముల కొనుగోలులో మోసపోకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

# నెక్నాంపూర్ 128వ వార్డులో పలు పౌర సమస్యలపై వినతి



### - వైఎస్ఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో 'వన్ డే -- వన్ వార్డు' కార్యక్రమం

రాజేంద్రనగర్, అక్టోంబర్ 12 ( వార్త వేదిక సూర్య ) :

నెక్నాంపూర్ 128వ వార్డు పరిధిలోని వైఎస్ఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నార్సింగి సర్కిల్-45 ఉప కమిషనర్ నిర్వహించిన 'వన్ డే -- వన్ వార్డు' కార్యక్రమంలో సిటిజన్స్ కౌన్సిల్ ప్రతినిధులు, స్థానిక నివాసితులు పలు పౌర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వైఎస్ఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని, పయనీర్ కాలనీ, ఈవీవీ కాలనీ, శ్రీ వెంకటేశ్వర కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, పాషా కాలనీ, కోహినూర్ ఎన్‌క్లేవ్, గోల్కొండ హిల్స్ ప్రాంతాల ప్రజలకు ఓటు హక్కు వినియోగించుకోవడం సులభతరం చేయాలని సుబ్బరాజు కోరారు. ప్రతిపాదిత 60 అడుగుల రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విజ్ఞప్తి చేశారు. పయనీర్ పార్కు అభివృద్ధికి కేటాయించిన రూ.20 లక్షల పనులకు త్వరగా ఉత్తర్వులు జారీ చేసి పనులు ప్రారంభించాలని కోరారు. పార్కు అభివృద్ధికి ఆటంకంగా ఉన్న నర్సరీని మరోచోటుకు తరలించాలని సూచించారు.బటర్‌ఫ్లై సర్కిల్ నుంచి పండెనవాగు నాలా వరకు ఉన్న 80 అడుగుల రహదారి ఆనంద లెగసీ నిర్మాణ పనుల కారణంగా దెబ్బతిన్నట్లు పేర్కొంటూ, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. నెక్నాంపూర్‌లోని పయనీర్ కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, కోహినూర్ కాలనీలతో పాటు ఇతర ప్రాంతాల్లో పార్కులు, పచ్చదనం అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్రీ వెంకటేశ్వర కాలనీ పార్కులో పెండింగ్‌లో ఉన్న మొక్కల నాటే కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. కోహినూర్ కాలనీ పార్కు అభివృద్ధి, వీధిదీపాల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు, గుంతల మరమ్మతులపై ఆ కాలనీ కోశాధికారి సమస్యలను ప్రస్తావించారు. పెరుగుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా



వైఎస్ఆర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌కు అదనపు అంతస్తులు నిర్మించాలని దేవరాజ్, సుబ్బారావు కోరారు. పలు కాలనీల్లో పనిచేయని వీధిదీపాలకు మరమ్మతులు చేయడంతో పాటు కొత్త దీపాలు ఏర్పాటు చేయాలని, చెత్తను అక్రమంగా పడేసే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలని సూచించారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసే అంశంపై స్థానికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ శ్రీధర్, డీఈ అన్వేష్ రెడ్డి, ఏఈ సంతోష్, వార్డు అధికారులు, పన్నుల తనిఖీ అధికారులు, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు. స్థానిక సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడిందని సిటిజన్స్ కౌన్సిల్ ప్రతినిధులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కాలపరిమితితో కూడిన చర్యలు చేపట్టి, సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

### రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసన.. ప్రజాస్వామ్య పరిరక్షణకు

# కాంగ్రెస్ పోరుబాట!



### ఛలో ఢిల్లీ -- మార్చ్ ఫర్ డెమోక్రసీ'లో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..

### ఓటు హక్కుల పరిరక్షణకు పారదర్శక చర్యలు తీసుకోవాలి

దేవరకొండ అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య ):-

దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటర్ల హక్కుల సంరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత సాధించాలనే డిమాండ్లతో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఛలో ఢిల్లీ -- మార్చ్ ఫర్ డెమోక్రసీ' కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని, ఎన్నికల సంఘం పనితీరుపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ గారి అరెస్టు నేపథ్యంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి అర్హుడైన పౌరుడి ఓటుకు రక్షణ కల్పించడం ఎన్నికల సంఘం బాధ్యత అని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలపై వస్తున్న అభ్యంతరాలు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై వ్యక్తమవుతున్న ప్రశ్నలకు సంబంధిత సంస్థలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మోదీ--షా ప్రభుత్వంపై ప్రశ్నలు.. ఎన్నికల సంఘం జవాబుదారీతనం అవసరం!

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని బాలు నాయక్ అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ప్రస్తావిస్తూ, ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని పేర్కొన్నారు

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతను కాపాడాలని, ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు రాజకీయ విమర్శలతో కాకుండా వాస్తవాలతో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాహుల్ గాంధీ పోరాటం.. ప్రజల ఓటు హక్కుల కోసమే!

ప్రజల ఓటు హక్కు, రాజ్యాంగ విలువల పరిరక్షణపై రాహుల్ గాంధీ లేవనెత్తుతున్న అంశాలను ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, నిరసన తెలపడం పౌరులకు ఉన్న హక్కులని, అలాంటి హక్కులకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని పేర్కొన్నారు

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల జాబితాల్లో తప్పులు ఉంటే సరిదిద్దాలని, ప్రతి ఓటరుకు తన హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం

దేశంలో ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం ఉండాలంటే ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని బాలు నాయక్ పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడటం, రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతను పరిరక్షించడం, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడం కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, ఓటర్ల హక్కుల పరిరక్షణకు సంబంధించిన డిమాండ్లకు మద్దతు తెలిపారు

## తుర్కపల్లి మండలంలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి గాయాలు !

తుర్కపల్లి 12 (వార్త వేదిక సూర్య ):



యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని తుర్కపల్లి--వాసాలమర్రి రహదారిపై హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగినట్లు సమాచారం.రెండు బైకులు బలంగా ఢీకొనడంతో తిర్మలాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తితో పాటు మరో వ్యక్తికి గాయాలైనట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకుంది. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అత్తాపూర్ లక్ష్మీనగర్ కాలనీలో నూతన వసతుల ప్రారంభం

### ఓపెన్ జిమ్, బ్యాడ్మింటన్ కోర్టులను ప్రారంభించిన ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, అక్టోంబర్ 12 ( వార్త వేదిక సూర్య ) :






రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ పార్కులో స్థానిక ప్రజల కోసం ఏర్పాటు చేసిన నూతన ఓపెన్ జిమ్, బ్యాడ్మింటన్ కోర్టు అలాగే చిన్నారుల ఆట వస్తువులను ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ?స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయడంతో పాటు, చిన్నారులకు ఆహ్లాదకరమైన ఆటపాటల వాతావరణం కల్పించే ఉద్దేశంతో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఈ నూతన సదుపాయాలను సమకూర్చారు.?ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పార్కులోని వసతులను పరిశీలించి, కాలనీవాసులతో ముచ్చటించారు. ప్రజలు నిత్యం వ్యాయామం చేస్తూ శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి ఈ ఓపెన్ జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ?ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక కార్పొరేటర్లు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మరియు పలువురు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలిపురంలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

### - అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

రాజేంద్రనగర్, అక్టోంబర్ 12 ( వార్త వేదిక సూర్య ) :





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం పద్మశాలిపురం వార్డు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. డిజిటల్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్-- మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ, టీ. ప్రేమ్ గౌడ్, బొల్లా వెంకటేష్, పల్నాటి ఉదయ్ కుమార్, గంజి వెంకటేష్, రేషన్ డీలర్లు పి. శేఖర్, మసన సత్యనారాయణ, మూసిని జీవన మూర్తి, ఈ. సత్యనారాయణ, శరణమ్మ తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 145
మంగళవారం
13 అక్టోబర్ 2026

# శంషాబాద్ మున్సిపల్ కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ





**-198 మంది పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు, చీరలు, జాకెట్లు అందజేత**

**రాజేంద్రనగర్, అక్టోంబర్ 12 ( వార్త వేదిక సూర్య ) :**
దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సంత్ ఆశారామ్ బాపూ ప్రేరణతో శ్రీ యోగ వేదాంత సేవా సమితి ఆధ్వర్యంలో శంషాబాద్ మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు సేవా కార్యక్రమం నిర్వహించారు. శంషాబాద్ జోన్ పరిధిలోని 198 మంది కార్మికులకు స్టీల్ పాత్రలు, చీరలు, చలి నుంచి రక్షణకు జాకెట్లు, సత్ సాహిత్య గ్రంథాలు, లాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం సామూహిక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నార్సింగి మార్కెట్ మాజీ చైర్మన్ డి. వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మా మహేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై కార్మికులకు వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు పండుగ వేళ అవసరమైన వస్తువులను అందించడం అభినందనీయమని, ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమితి అధ్యక్షుడు ముక్తియార్ సింగ్, ఉపాధ్యక్షుడు జేశురాజ్ బాలాపూర్ తదితర సేవాదారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# నల్లగొండ



## మామిడిపల్లిలో శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు!

**-ఈ నెల 11 నుండి 16 వరకు ఆరు రోజుల పాటు కన్నులపండువగా బ్రహ్మోత్సవాలు.**

**-ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్‌లకు ఆహ్వాన పత్రాలు అందజేత**

**రాజేంద్రనగర్, అక్టోంబర్ 12 ( వార్త వేదిక సూర్య ) :**
బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు ఆరు రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా జరగనున్నాయి. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రముఖులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్‌లను ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈ వేడుకలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకోవాలని వారిని సాదరంగా ఆహ్వానించారు.పరాభవ నామ సంవత్సర అశ్వయుజ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోవాలని, తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

# అమ్మవారి ఆశీస్సుల ఎల్లప్పుడూ అందరికీ ఉండాలి

**బిఆర్ఎస్ నాయకులు - మంద భవాని జగన్**

**సికింద్రాబాద్, అక్టోబర్ 12(వార్త వేదిక సూర్య)**
శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల భాగంగా ఎన్టీఆర్ నగర్ కొత్తపేటలోని టీం శక్తి రవి చారి, భవాని ప్రసాద్, నారోజు శివ ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ నాయకులు మాజీ వార్డు మెంబర్ సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు సికింద్రాబాద్ ఎస్సి ఎస్టి బిసి మైనారిటి సెల్ ప్రెసిడెంట్ మంద భవాని జగన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ముక్కులు చెల్లించుకున్నారు ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికీ ఆ యొక్క అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చింతకింది మల్లేష్, కర్నాటి ఆనంద్, శివ, సన్నీ, పులి శివకుమార్, తిరుమల రవి, ఒగ్గు శ్రీధర్, తిరుమల సంతోష్, జబ్బెట రాజు, వల్లపు మురళి తదితరులు పాల్గొన్నారు.



# దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ వీధుల్లోకి వచ్చి పోరాటం చేస్తుండు






**ఆయనకు మద్దతుగా మనమందరం వీధుల్లోకి రావాల్సిందే : జగ్గారెడ్డి**

**మన అధినేత రాహుల్ గాంధీ ఢిల్లీ రోడ్ల పై ఉంటే మనం ఇళ్లలో పడుకోవడం కరెక్టేనా ?**

**రాహుల్ గాంధీ పోరాటానికి కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు దేశ ప్రజలందరూ మద్దతు ఇవ్వాలి**

**దేశం లో ఓట్ చోరీ జరుగుతుంది. బీజేపీ ప్రజల హక్కులను కాలరాస్తోంది**

**ఇదే విషయాన్ని ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త మరో పదిమందికి ప్రచారం చేయాలి**

**జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు రాహుల్ గాంధీ పోరాటం ఆపబోనని ప్రకటించారు**

**ఆయన డిమాండ్ నెరవేరేవరకు ఆయనకు మద్దతు గా సంగారెడ్డి లో నా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది**

**సంగారెడ్డి లో రాహుల్ గాంధీకి మద్దతుగా జరిగిన భారీ ర్యాలీలో స్పష్టం చేసిన జగ్గారెడ్డి**

**సంగారెడ్డి, వార్త వేదిక సూర్య అక్టోబర్ 12:**
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సోమవారం సంగారెడ్డి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి ఓల్డ్ బస్టాండ్‌లోని అంబేద్కర్ చౌక్ వరకు సాగిన ర్యాలీలో నిర్మలా జగ్గారెడ్డితో పాటు వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. "జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి", "మోదీ డౌన్ డౌన్", "రాహుల్ గాంధీ జిందాబాద్" అంటూ ర్యాలీ పొడవునా నినాదాలు చేశారు. అంబేద్కర్ చౌక్‌కు చేరుకున్న అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, బీజేపీ దొంగ ఓట్లతో అధికారంలోకి వస్తోందని ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ వీధుల్లోకి వచ్చి పోరాడుతున్నారని, ఆయనకు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

"రాహుల్ గాంధీ ఢిల్లీ రోడ్లపై పోరాడుతుంటే మనం ఇళ్లలో విశ్రాంతి తీసుకోవడం సరైనదేనా? ఆయనకు మద్దతుగా మనమందరం వీధుల్లోకి రావాల్సిందే" అని అన్నారు. తాను ఢిల్లీ వెళ్లగలిగినప్పటికీ, రాహుల్ గాంధీ పోరాటానికి స్థానికంగా సంఘీభావం తెలియజేయాలనే ఉద్దేశంతో సంగారెడ్డిలోనే ఉండి ర్యాలీ నిర్వహించినట్లు వివరించారు.

ఓట్ల చోరీ జరుగుతోందని, బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తోందని జగ్గారెడ్డి ఆరోపించారు. ఈ అంశాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కనీసం పది మందికి వివరించి, ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.

జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆపబోమని రాహుల్ గాంధీ ప్రకటించారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఆ డిమాండ్ నెరవేరే వరకు సంగారెడ్డిలోనూ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. "రాహుల్ గాంధీ రోడ్డుపై పడుకుని నిరసన తెలిపితే, మనం కూడా అదే విధంగా ఆయనకు మద్దతుగా నిలవాలి" అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## జై దుర్గాభవాని యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

**సికింద్రాబాద్, అక్టోబర్ 12(వార్త వేదిక సూర్య)**



శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని సోమవారం జై దుర్గ భవాని యూత్ అసోసియేషన్ ఆర్గనైజర్ బి.ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ ఆ యొక్క అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో బి. ప్రమోద్ కుమార్, ఎం. సురేష్, ఎం. శ్రీకాంత్, తౌటం మహేష్, మురళి, ఎం. సరీన్, ఎం. కిరణ్, తౌటం రాజశేఖర్, టి. రాజేష్, టి. సతీష్, ఎన్. సాయికృష్ణ, వి. శివ, ఎస్. తారక్, టి. పండు, లింగం, శంకు సాయి, నిహాల్, రిత్విక్, ప్రణీత్, తౌటం హర్షవర్ధన్, టి. శ్రీయాన్ష్, టి. మోక్షిత్, టి. తేజాన్ష్, టి. దేవాన్ష్, యువకులు పాల్గొన్నారు.

# కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

**ఓటు చోరీ అంటే ప్రజాస్వామ్యంపై దాడి - ఓటర్ల హక్కుల పరిరక్షణకు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పోరాటం చేస్తుంది.**

**టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

**కూకట్ పల్లి, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య) :**
తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఇతర పార్టీ నాయకులు పెద్ద ఎత్తున న్యూఢిల్లీలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదని, కోట్లాది మంది పౌరుల ఓటు హక్కుకు భంగం కలిగించే చర్యలు ప్రజాస్వామ్య పునాదులనే బలహీనపరుస్తాయని అన్నారు. ఓటర్ల జాబితాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని, ఓట్ల తొలగింపు, ఓటర్ల హక్కులకు విఘాతం కలిగిందనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల ప్రభావంలో ఎన్నికల సంఘం పనిచేస్తోందనే అనుమానాలకు తావులేకుండా, ఎన్నికల సంఘం తన స్వతంత్రతను, నిష్పక్షపాత వైఖరిని నిరూపించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లే పరిస్థితులు ఏర్పడటం దేశానికి ప్రమాదకరమని అన్నారు.




"ఓటు చోరీ అంటే ప్రజల తీర్పును దొంగిలించడమే. ప్రజల ఓటు హక్కును హరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కోట్లాది మంది ఓటర్ల హక్కులపై ప్రశ్నలు తలెత్తుతున్నప్పుడు ఎన్నికల సంఘం మౌనంగా ఉండకూడదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలి. ఆయన హయాంలో తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలపై సమగ్ర, నిష్పక్షపాత పునఃసమీక్ష జరగాలి. చట్టవిరుద్ధ చర్యలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి" అని డా. సత్యం శ్రీరంగం డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, రాజ్యాంగ విలువలను కాపాడటం, ప్రతి పౌరుడి ఓటు హక్కును సంరక్షించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఓటుతో ఏర్పడే ప్రభుత్వాల విషయంలో పారదర్శకత, ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాత వైఖరి అత్యంత అవసరమని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని న్యూఢిల్లీలో ప్రదర్శనలు నిర్వహించారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రతి ఓటు విలువను కాపాడటం కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని డా. సత్యం శ్రీరంగం స్పష్టం చేశారు.

## సంగారెడ్డిలో దావత్ రెస్టారెంట్-2 ప్రారంభం

**సంగారెడ్డి, వార్త వేదిక సూర్య ప్రతినిధి అక్టోబర్ 12:**
సంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన దావత్ రెస్టారెంట్-2ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీఐఐసీ మాజీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాణ్యమైన సేవలు అందిస్తూ వినియోగదారుల ఆదరాభిమానాలు పొందాలని ఆకాంక్షించారు. ఆహార రంగంలో నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ నిర్వాహకులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన సంతోష్, 30వ కౌన్సిలర్ మనిషా, రెస్టారెంట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# మూసాపేట్‌లో ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు



అమ్మవారికి తొలి పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్.



**కూకట్ పల్లి, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య) :**
కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని మూసాపేట్‌లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూసాపేట్‌లోని కేపీఎం మైదానంలో యంగ్ స్టార్ యువజన సంఘం, తూము మనోజ్ కుమార్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవాల్లో మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాల్గొని అమ్మవారికి తొలి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, భక్తితో మొక్కులు సమర్పించారు. అనంతరం తూము శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరికీ అమ్మవారి కరుణాకటాక్షాలు లభించి, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని కోరుకున్నారు. దసరా నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించడంతో పాటు, ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. యువత ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో స్థానికులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలతో కేపీఎం మైదానంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు తూము సాయి, జిల్లా మనోజ్, తూము శశాంక్, వెంకటకృష్ణ, నిఖిల్, రాహుల్, దీక్షిత్, హరీష్, వంశీ, దేవేందర్, క్రాంతి, అఖిల్, శశాంక్ తదితర యువకులు, భక్తులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో దావత్ రెస్టారెంట్ రెండో బ్రాంచ్ ప్రారంభం

### ప్రారంభించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు .. నిర్వాహకులకు శుభాకాంక్షలు



**సంగారెడ్డి, వార్త వేదిక సూర్య, అక్టోబర్ 12:**
సంగారెడ్డి పట్టణంలో దావత్ రెస్టారెంట్ రెండో బ్రాంచ్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు నిర్వాహకులు ఇందూరి రమేష్, వడ్ల బింబాదర్ చారి, సంగమేష్ తో కలిసి ప్రారంభించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, ఆధునిక సౌకర్యాలతో కస్టమర్లను ఆకట్టుకునేలా రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు మాట్లాడుతూ.. వ్యాపార రంగంలో కొత్తగా అడుగుపెట్టే వారు, తమ వ్యాపారాలను విస్తరిస్తున్న నిర్వాహకులు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దావత్ రెస్టారెంట్ రెండో బ్రాంచ్‌ను ప్రారంభించడం సంతోషకరమని పేర్కొంటూ, నిర్వాహకులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. రెస్టారెంట్ ప్రజల ఆదరణ పొందుతూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆధునిక వసతులతో ఏర్పాటు చేసిన ఈ రెస్టారెంట్ స్థానిక ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ఆహార సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌తో పాటు మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, సుధీర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి , మోతి సింగ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




# కలం కవాతు రచయిత కట్టెలకి సన్మానం

**చౌటుప్పల్ అక్టోబర్ 12 వార్తా వేదిక సూర్య**
చౌటుప్పల్ కోర్ట్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలం కవాతు పుస్తక రచయిత కట్టెల లింగస్వామిని ఘనంగా సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

తెలంగాణ ఉద్యమకారుడు, రచయిత కట్టెల లింగస్వామి కలం కవాతు పుస్తక రచన ద్వారా సామాజిక సమస్యలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ, ప్రజలను చైతన్య పరుస్తున్నారు. అనేక సామాజిక ఉద్యమాల్లో ముందుండే కట్టెల లింగస్వామి మున్ముందు గొప్ప గొప్ప కవితలు ఆవిష్కరించాలని బార్ అసోసియేషన్ సభ్యులు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాడూరు పరమేష్, ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు పిట్టల భిక్షమయ్య, జాయింట్ సెక్రెటరీ మక్తాల నరసింహ, ఎగ్జిక్యూటివ్ మేంబర్స్ పిల్లలమర్రి కిరణ్, జ్యోతి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, బాల్యం వెంకటాచలపతి, సీనియర్ న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, నా = బిక్షపతి, బడుగు శ్రీకాంత్, చామట్ల జంగయ్య, పాల పరమేశ, జక్కర్తి శేఖర్, జిల్లా రమేష్, పిట్టల భరత్, శ్రీకాంత్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# బొల్లారం చిన్నారి హత్య కేసును ఛేదించిన పోలీసులు

### డబ్బు కోసం సెక్యూరిటీ గార్డే..



**హైదరాబాద్, అక్టోబర్ 12:** భాగ్యనగరం బొల్లారం పరిధిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఐదేళ్ల చిన్నారి కిడ్నాప్, హత్య కేసును మల్కాజ్‌గిరి పోలీసులు ఛేదించారు. గేటెడ్ కమ్యూనిటీలో పనిచేసే ఓ సెక్యూరిటీ గార్డే ఈ హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు.

ఈ కేసుకు సంబంధించిన వివరాలను మల్కాజ్‌గిరి సీపీ సుమతి మీడియా సమావేశంలో వెల్లడించారు. 'బొల్లారం పరిధిలోని సీడ్ వర్క్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో రీసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న మిల్టన్ ఫెర్నాండెజ్ మోసెస్ ఐదేళ్ల కుమార్తె ఆరేలియా.. అక్టోబర్ 10న సాయంత్రం వేళ కిడ్నాప్‌కు గురైంది. అదే రోజు రాత్రి 7:45 గంటల సమయంలో రూ.20 లక్షలు డిమాండ్ చేస్తూ కిడ్నాపర్.. చిన్నారి తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. ఈ మేరకు చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు ఆధారంగా.. మల్కాజ్‌గిరి, ఎస్ఓటి, క్రైమ్స్, స్పెషల్ బ్రాంచ్‌లతో కూడిన పది ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాం. అయినా ఫలితం లేకపోయింది. సీసీటీవీ ఫుటేజీ, మొబైల్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేశాం. 4 గంటల్లో 130 సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించాం. ఎక్కడా చిన్నారి ఆచూకీ కనిపించకపోవడంతో.. గేటెడ్ కమ్యూనిటీ అంతా గాలించగా సెల్లార్‌లోని నీటితొట్టెలో చిన్నారి మృతదేహం కనిపించింది. ఈ మేరకు అనుమానం వచ్చి సెక్యూరిటీ గార్డులను విచారణ చేయగా.. అసలు నిజం బయటపడింది.

కమ్యూనిటీలో సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్న విక్రమ్ కుమార్ డబ్బు కోసం పాపను కిడ్నాప్ చేసినట్లు అంగీకరించాడు.

అయితే.. చిన్నారి తల్లిదండ్రులు రూ.25 లక్షలు ఇచ్చేంతవరకు చిన్నారిని తన వద్ద అట్టిపెట్టుకోవడం కష్టమని భావించి.. చిన్నారి కాళ్లుచేతులు కట్టేసి సెల్లార్‌లోని నీటితొట్టెలో పడేసి హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. ఈ మేరకు నిందితుడికి శిక్ష విధించేలా విచారణ కొనసాగిస్తున్నాం' అని సీపీ సుమతి చెప్పారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గేటెడ్ కమ్యూనిటీల్లో సెక్యూరిటీ సిబ్బంది నేపథ్యాన్ని తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్, పని మనుషుల వివరాలను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# నీటిని పొదుపుగా వాడుకోవాలి



చెనుగోనుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుమోహన్

### అదనపు కలెక్టర్ మధుమోహన్

**గద్వాల, అక్టోబరు 12 (వార్త వేదిక సూర్య):**
ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున, ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, మం త్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నతాధికారులతో కలిసి రైతుసేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాలోని రైతువేదికల్లో పాల్గొన్న అధికారులు, రైతులతో వీసీ ద్వారా మాట్లాడారు. రబీ సీజన్‌లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరిసాగు చేయవద్దన్నారు. బిందుసేద్యంతో ఆయిల్‌పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని సూచించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడుగుంతలు, నీటికుంటలు, బోర్‌వెల్స్ రీచార్జ్ తదితర పనులు చేపట్టి జలవనరులను కాపాడుకోవాలన్నారు. గద్వాల మండలం చెనుగోనుపల్లి గ్రామ రైతువేదిక వద్ద అదనపు కలెక్టర్ అధికారులు, రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించారు. వీసీ అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అనుసరించి రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలన్నారు. ఎల్‌ని నో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలుచేయడం జరు గుతుందన్నారు. ఈక్రమంలో ఆరుతడి పంటల సాగుపై రైతులకు పెద్దఎత్తున అవగాహన క ల్పించేందుకు విస్తృతంగా అన్నిమాధ్యమాల ద్వారా, కళాజాత బృందాలతో ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. రైతులు నష్టపోకుండా ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కృషి చేస్తారని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచు పద్మమ్మ, నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్‌కుమార్, రాజశేఖర్, వ్యవసాయ శాఖ ఏవోలు ప్రతాప్‌కుమార్, సాజిద్, ఏఈవో ప్రవలిక, పంచాయతీ కార్యదర్శి రామనర్సింహులు, రైతులు పాల్గొన్నారు.



# బాలానగర్‌లో మహిళ అదృశ్యం..

### ఆచూకీ కోసం పోలీసుల దర్యాప్తు

### బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

**బాలానగర్, అక్టోబర్ 12 (వార్త వేదిక సూర్య) :**
హైదరాబాద్‌లోని బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలానగర్‌లోని వినాయక్ నగర్, రోడ్ నంబర్ 10కు చెందిన నారాయణమ్మ (64) సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై ఆమె కుమారుడు జోడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నారాయణమ్మ అక్టోబర్ 12వ తేదీ ఉదయం సుమారు 7.15 గంటలకు ఎప్పటిలాగే ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అయితే, ఎంతసేపటికీ ఆమె తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వెంటనే చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లలోనూ వెతికారు. అయినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. ఆమె తన చరవాణిని సైతం ఇంట్లోనే వదిలి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. దీంతో అదృశ్యమైన మహిళ కుమారుడు జోడు శ్రీనివాస్ అదే రోజు ఉదయం సుమారు 11 గంటల సమయంలో బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు మహిళ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆమె ఆచూకీ తెలుసుకునేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

# సుల్తాన్‌పల్లిలో అనాథాశ్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, అక్టోంబర్ 12 ( వార్త వేదిక సూర్య ) :**






శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లిలోని వృద్ధాశ్రమ ప్రాంగణంలో సేవా భారతి ఫౌండేషన్ నూతనంగా ఏర్పాటు చేసిన అనాథాశ్రమాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. తల్లిదండ్రుల ఆదరణకు దూరమైన చిన్నారులకు ఆశ్రయం కల్పించడంతో పాటు వసతి సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ఈ అనాథాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 20 మంది చిన్నారులకు ఇక్కడ ఆశ్రయం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# విజయవాడ బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురి సజీవ దహనం

**విజయవాడ, అక్టోబర్ 12:** నగరంలో ఘోర ప్రమాదం జరిగింది. స్థానిక బైపాస్ రోడ్డులో కారు రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న నలుగురు సజీవ దహనమయ్యారు. స్థానికులు వెంటనే స్పందించి.. పోలీసులతోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పారు.

ఈ ప్రమాదంలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని సమీపంలోని ఆసుపత్రికి పోలీసులు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులు గుంటూరు జిల్లా నంబూరు, విజయవాడ సమీపంలోని నున్న వాసులని పోలీసులు వివరించారు. మృతులు రాందేవ్, అరుణ, విజయతోపాటు చిన్నారిగా గుర్తించామని అన్నారు. నంబూరులో ఓ ఫంక్షన్‌లో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు.

ప్రమాదం తీవ్రంగా కలచివేసింది: మంత్రి లోకేశ్

ఈ ప్రమాద ఘటనపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందించారు. 'విజయవాడ వెస్ట్ బైపాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు సజీవదహనం కావడం తీవ్రంగా కలచివేసింది. మృతులకు నివాళులు అర్పిస్తున్నాను. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2
సంచిక : 145
మంగళవారం
13 అక్టోబర్ 2026



# సీఎం విజయ్ ని కలిసిన రౌడీ విజయ్..



టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులు తాజాగా కోలీవుడ్ స్టార్ హీరో తలపతి విజయ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. రణబాలి సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చెన్నైకి వెళ్ళిన ఈ జంట.. సీఎం విజయ్ ని కలిశారు. విజయ్ సైతం.. కొత్త దంపతులను ఆప్యాయంగా ఆహ్వానించి కొద్దిసేపు ముచ్చటించారు. ఈ అరుదైన భేటీకి సంబంధించిన అనుభవాలను విజయ్ దేవరకొండ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.

'ఎంతో బిజీ షెడ్యూల్, సుదీర్ఘమైన పనిదినం తర్వాత కూడా ఆయన మమ్మల్ని ఎంతో ప్రేమతో ఆహ్వానించారు. విజయ్ గారితో ఎంతో అద్భుతమైన సమయాన్ని గడిపాను. జీవితం, పని అలాగే ప్రపంచం గురించిన తన అమూల్యమైన వ్యక్తిగత అభిప్రాయాలను మాతో పంచుకున్నారు. కేవలం ఒక్కసారే కల్సినా సరే, ఆయన నాకు ఎంతో ఇష్టమైన వ్యక్తి అయిపోయారు. మళ్లీ కలుద్దాం సర్' అని విజయ్ చెప్పుకొచ్చాడు. ఇక రష్మిక కూడా విజయ్ పై ఉన్న అభిమానాన్ని బయటపెట్టింది. 'చాలా కాలం తర్వాత దళపతి విజయ్ గారిని కలిసే అవకాశం దొరికింది. ఆయనను ఆరాధించడం మొదలుపెట్టిన రోజు నుంచి, ఆయనతో కలిసి పనిచేసే అవకాశం రావడం, నేడు ఆయనను ఒక ముఖ్యమంత్రిగా గౌరవించే స్థాయికి ఎదగడం వరకు ప్రతీదీ అద్భుతంగా అనిపిస్తోంది. ఆయన ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం' అంటూ తెలిపింది.

ఇక ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు, టాలీవుడ్ - కోలీవుడ్ స్టార్ హీరోల కలయికపై రకరకాల కామెంట్స్ చేస్తున్నారు. విజయ్ దేవరకొండ నోటా సినిమాలో రౌడీ సీఎంగా నటించిన విషయం తెల్సిందే. ఇక ఇప్పుడు అది గుర్తు తెచ్చుకొని మ్యూచువల్ ఫ్యాన్స్ సీఎం విజయ్ ని కలిసిన రౌడీ విజయ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇకపోతే రణబాలి అక్టోబర్ 16 న ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి ఈ సినిమాతో విజయ్ - రష్మిక ఎలాంటి విజయాన్ని అందుకుంటారో చూడాలి.

# మళ్లీ రెచ్చిపోయిన అక్కినేని కోడలు..

శోభితా ధూళిపాళ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు అంటే అమ్మడి గురించి తెలుగులో ఎవరికి తెలిసింది లేదు. తెనాలి అమ్మాయి అయినా కూడా బాలీవుడ్ లో అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకుంది. ముఖ్యంగా అందాల ఆరబోతకు బ్రాండ్ అంబాసిడర్ గా మారింది. 'మేడ్ ఇన్ హెవెన్', 'మేజర్', 'పొన్నియిన్ సెల్వన్', 'మంకీ మ్యాన్' లాంటి సినిమాలతో అన్నీ భాషల్లో శోభిత తన సత్తా చాటింది. అయినా కూడా ఆమె తెలుగువారికి పరిచయమైంది మాత్రం అక్కినేని నాగ చైతన్య గర్ల్ ఫ్రెండ్ గానే. వీరిద్దరి డేటింగ్ వార్తల తరువాతనే శోభిత ఎవరు అనేది తెలుగు ప్రేక్షకులకు తెల్సింది. ఇక వీరి ప్రేమ పెళ్లిగా మారి.. శోభిత అక్కినేని పెద్ద కోడలిగా బాధ్యతలు అందుకుంది.

పెళ్లి తరువాత పద్ధతిగా కనిపించడంతో.. శోభిత గత జీవితాన్ని, ఆమె అందాల ఆరబోతని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అయితే మరోసారి అక్కినేని కోడలి బోల్డ్ లుక్ గురించి నెటిజన్స్ చర్చించుకుంటున్నారు. అందుకు కారణం.. శోభిత పెళ్లి తర్వాత తొలిసారిగా అత్యంత బోల్డ్‌గా 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' మ్యాగజైన్ కవర్ పేజీ కోసం స్టైలిష్ ఫోటోషూట్ చేయడమే. ఈ కవర్ పేజీ కవర్ లుక్‌లో క్రాప్డ్ గ్రే ఫాక్స్ ఫర్ జాకెట్, బ్లాక్ బ్రీఫ్స్, క్రిస్టల్ పెండెంట్ ఉన్న స్కల్ప్టెడ్ గోల్డ్ బెల్ట్‌తో ఎడ్జీ లుక్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరించింది. అలాగే బ్లాక్ హాల్టర్ విత్ స్ట్రాపీ కట్-అవుట్స్, ప్లమ్ బాడీసూట్, మెజెంటా వన్-షోల్డర్ డ్రేప్‌తో పాటు క్రిస్టల్-ఫ్రింజ్డ్ థై-హై బూట్స్‌లో శోభితా కనిపించిన తీరు ఒక స్టైలింగ్ మాస్టర్‌క్లాస్‌ను తలపించింది. స్మోకీ ఐస్, న్యూడ్ లిప్స్‌తో మెరిసిన ఆమె లేటెస్ట్ లుక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. ఇక ఈ ఫోటోలను చూసి నెటిజన్స్ మళ్లీ రెచ్చిపోయిన అక్కినేని కోడలు అంటూ కామెంట్స్ పెడుతున్నారు.

ఇక సినిమాల విషయానికి వస్తే, శోభితా ప్రస్తుతం పా.రంజిత్ దర్శకత్వంలో వస్తున్న వెట్టువమ్ చిత్రంలో నటిస్తుంది. ఈ సినిమాలోని తన పాత్రపై మాట్లాడిన శోభితా, 'ఈ రోల్ కోసం నా సర్వస్వం ధారపోసాను. చాలా రోజులుగా ఇలాంటి పవర్ ఫుల్ క్యారెక్టర్ కోసమే దేవుడిని ప్రార్థిస్తున్నాను'అని తెలిపింది. బోల్డ్ స్టైల్‌తో పాటు పవర్ ఫుల్ పాత్రలతో దూసుకుపోతున్న శోభితా లేటెస్ట్ పిక్స్ పై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. మరి ఈ సినిమాతో శోభిత ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.





# బన్నీ-లోకేష్ సినిమా ఆగిపోయిందా? అసలు నిజం ఇదే

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్ ఇండియా సినిమా రాబోతోన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ అయినప్పటి నుంచే సినీ వర్గాలతో పాటు అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే, కొన్ని రోజులుగా ఈ సినిమా ఆగిపోయిందంటూ సోషల్ మీడియాలో రకరకాల రూమర్స్ వైరల్ అయ్యాయి. ఈ వార్తలతో బన్నీ అభిమానులు ఆందోళన చెందారు. కానీ, ఆ రూమర్లన్నింటికీ తాజాగా డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తనదైన శైలిలో చెక్ పెట్టేశారు. అల్లు అర్జున్‌తో దిగిన ఒక ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేసిన ఆయన.. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన ఆసక్తికరమైన అప్‌డేట్స్ రానున్నాయని వెల్లడించారు. ఈ పోస్ట్ ఒక్కసారిగా సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. లోకేష్ చేసిన ఈ ట్వీట్‌తో బన్నీ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకి సంబంధించిన పోస్టర్, అధికారిక ప్రకటన లేదా షూటింగ్ షెడ్యూల్ వివరాలు వెలువడే అవకాశం ఉందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు.

ఇక ఈ ఏడాది జనవరిలో అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ తొలిసారి కలిసి పనిచేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఆ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో ప్రేక్షకుల్లో పూనకాలు తెప్పించింది. కథ గురించిన పూర్తి వివరాలు బయటకు రాకపోయినా, ఆ వీడియోతోనే అంచనాలు స్కై రేంజ్‌కి వెళ్లిపోయాయి. ఈ భారీ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా.. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. అల్లు అర్జున్ స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్, లోకేష్ రా అండ్ రస్టిక్ మేకింగ్, అనిరుధ్ అదిరిపోయే మ్యూజిక్ కలిస్తే తెరపై ఎలాంటి విజువల్ వండర్ చూస్తామోనని సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

మరోవైపు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం 'రాకా' (ఞుఖ్ఞు) చిత్రంతో బిజీగా ఉన్నారు. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ (ఞూశ్రీవవ) తెరకెక్కిస్తోన్న ఈ చిత్రంలో దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ దాదాపు వెయ్యి కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానున్న 'రాకా'పై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక 'రాకా' షూటింగ్ పూర్తయిన వెంటనే లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. లోకేష్ కనగరాజ్ ప్రత్యేకమైన కథన శైలి, పవర్ ఫుల్ యాక్షన్ సన్నివేశాలు అల్లు అర్జున్ ఇమేజ్‌కి పర్ఫెక్ట్‌గా సెట్ అవుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి ఈ కాంబో ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు రానుంది?.. బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచనాలు క్రియేట్ చేయనుందో తెలియాలంటే మరికొన్ని రోజులు ఎదురుచూడాల్సిందే.

# మరో కొత్త కథతో సిద్ధమైన సుహాస్.. ప్రోమో అదిరింది

టాలీవుడ్‌లో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వర్సటైల్ యాక్టర్ సుహాస్ (ూబష్ఞుం). ఒక పక్క హీరోగా.. ఇంకోపక్క విలన్ గా నటిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందుకున్నాడు. ఇటీవలే మండాడి చిత్రంలో విలన్‌గా నటించి అందరినీ మెప్పించిన సుహాస్.. తాజాగా తన తదుపరి సినిమాతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యాడు. సుహాస్ హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం హైడ్ ఒ సిల్క్. రాజేంద్ర బాలా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో లబ్బర్ పందు, డిసి ఫేమ్ సంజనా కృష్ణమూర్తి హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి సుహాస్ తండ్రి పాత్రలో కనిపించనున్నాడు.

క్యూట్ అండ్ రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోన్న ఈ సినిమా టైటిల్ ప్రోమోను మేకర్స్ గ్రాండ్‌గా విడుదల చేశారు. ఈ ప్రోమో ఆద్యంతం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో సుహాస్ ఒక చేనేత కార్మికుడి పాత్రలో కనిపించనున్నాడు. తన జీవితంలో మొదటిసారి నేసిన చీరను ఏ అమ్మాయి ధరిస్తుందో, ఆ అమ్మాయికి తెలియకుండానే తనను చూడాలనుకునే ఓ ప్రత్యేకమైన



యువకుడి కథతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటున్నట్లు ఈ ప్రోమో చూస్తే స్పష్టమవుతోంది.

# సింగర్ దామిని బోల్డ్ స్టెప్.. తెలుగు మ్యూజిక్ ఇండస్ట్రీలో కొత్త చర్చ



'బాహుబలి'లో పచ్చ బొట్టేసిన' పాట విన్న ఎవరికైనా టక్కున గుర్తొచ్చే పేరు సింగర్ దామిని(ఞుఎఅఅఙ). ఆ పాటకు ముందు కొన్ని పాటలు పాడినా.. పచ్చబొట్టు పాటతోనే మంచి గుర్తింపు లభించింది. ఆ పాటతో ఆమెకు చాలా అవకాశాలు వచ్చాయి. కానీ ఈ రేంజ్‌లో ఏ పాట క్లిక్ కాలేదు. కొంత జర్నీ తర్వాత అవకాశాలు కూడా తగ్గాయి. దాంతో ప్రైవేట్ ఆల్బమ్స్ చేయడం, బ్యాండ్స్‌లో పాడటం మొదటుపెట్టింది. వాటిలో ఇంగ్లిష్ పాటలు కాస్త ఎక్కువగా ఉంటాయి. అయితే ఇప్పుడు ఆమె సరికొత్త అవతార్‌లో దర్శనమిచ్చి సంగీత ప్రియులను ఆశ్చర్యపరిచింది.ఇన్నాళ్లూ గర్ల్ నెక్స్ట్ డోర్ ఇమేజ్‌తో కనిపించిన ఆమె.. తాజాగా విడుదల చేసిన 'సే యు వాంట్ మీ' (ఞుఎ ఎశీబ ఞుఖ్ ఎవ) మ్యూజిక్ వీడియోతో తనలోని మరో కోణాన్ని పరిచయం చేసింది. టూ పీస్ డ్రెస్, బోల్డ్ విజువల్స్, స్టైలిష్ ప్రెజెంటేషన్, పిచ్చేక్కించే ఎక్స్‌ప్రెషన్స్‌తో సాధారణ మ్యూజిక్ వీడియోలకు భిన్నంగా ఈ వీడియో ఉంది. హాలీవుడ్ పాప్ ఆల్బమ్స్ తరహా విజువల్ ట్రీట్ అందించే ప్రయత్నం ఇందులో కనిపిస్తోంది. తన లుక్, బాడీ లాంగ్వేజ్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో హాట్‌హాట్‌గా దామిని కనిపించింది. ఆ పాటలోని బోల్డ్ థీమ్‌కు అనుగుణంగా ఆమె ఎంచుకున్న స్టైలింగ్, కాస్ట్యూమ్స్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాయి.

అసలు ఆమె చేసిన ఈ వీడియో థీమ్‌కు ఆమె ఇచ్చిన డిస్క్రిప్షన్ ఏంటంటే... "ఒక మహిళ తన కోర్కెలు, ఆనందం, వ్యక్తిగత హద్దులు గురించి చెప్పే స్పైసీ సెక్సీల్ బోల్డ్ మ్యూజిక్ వీడియో ఇది. ఈ పాట మీ శరీరంపై, మీ కోరికలపై మీకే పూర్తి స్వేచ్ఛ, హక్కు ఉన్నాయనే భావనను కలిగిస్తుందని ఆశిస్తున్నాను. అలాగే ఏకాంతంలో ఆస్వాదించడానికి ఇది మంచి పాట" అని ఆమె వీడియో డిస్క్రిప్షన్‌లో పేర్కొంది. అయితే ఇంత బోల్డ్ ఎక్స్‌పెరిమెంట్ తెలుగు సింగర్స్‌లో ఎవరూ చేయలేదు. బాలీవుడ్ సింగర్స్‌తో జోనితా గాంధీ, నీతి మోహన్ లాంటి సింగర్స్ షోల్లో ఇంతగా ఎక్స్‌పోజ్ చేస్తుంటారు. కానీ తెలుగు సింగర్స్‌లో ఇంత బోల్డ్‌గా ఎవరూతెరపై కనిపించలేదు. ఇప్పుడు ఇది చర్చనీయాంశంగా మారింది. సింగర్‌గా ఎన్నో వేదికలపై సంప్రదాయంగా కనిపించిన దామిని ఒక్కసారిగా ఇలా ఎందుకు మారిపోయింది.. మ్యూజిక్ ఆల్బమ్ కోసమే అయిన ఇంత బోల్డ్‌నెస్ ఎందుకు అంటూ కామెంట్స్ చేస్తున్నారు.



Printed, Published and Owned by POLOJU SRINIVASA CHARY, and Printed at SURYA DIGITAL PRINTERS, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State -508252. Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:-TGTEL/25/A0305, Cell:9985389183. Emailld:vaarthavedhikasurya2025@gmail.com